


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 03.11.2025 | సంపుటి : 2 | సంచిక :269 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Monday | 03.11.2025 | volume : 2 | Issue : 269 | Pages : 8 | Cost : 2/- |


# ప్రపంచకప్ మనదే..




2 లో..

## మహిళల వరల్డ్‌కప్-2025 విజేతగా భారత్

### చరిత్ర సృష్టించిన భారత అమ్మాయిలు

### దీప్తి శర్మ, షఫాలీ వర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శన

ఎన్నో ఏళ్ల నిరీక్షణకు ఫలితం దక్కింది. తొలిసారి టీమ్‌ఇండియా మహిళల ప్రపంచకప్‌ను ఒడిసిపట్టుకుంది. అత్యంత ఆసక్తిగా జరిగిన ఫైనల్‌లో భారత జట్టు అదరగొట్టింది. దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో చిత్తుచేసింది. దీంతో మైదానంలోని ఆటగాళ్లతో పాటు, టీవీ, మొబైల్ తెరలకు అతుక్కుపోయిన అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ క్షణం కోసం ఏళ్లతరబడి ఎదురుచూసిన భారతావని ఒక్కసారిగా పులకించిపోయింది.

47 ఏళ్ల తమ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. ఐసీసీ మహిళల ప్రపంచకప్-2025 విజేతగా భారత్ నిలిచింది. ఆదివారం నవీ ముంబై వేదికగా జరిగిన ఫైనల్లో సౌతాఫ్రికాను 52 పరుగుల తేడాతో చిత్తు చేసిన టీమిండియా.. తొలి వరల్డ్‌కప్ టైటిల్‌ను ముద్దాడింది. 299 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా 45.3 ఓవర్‌లో 246 పరుగులకు ఆలౌటైంది.



## భారత రాష్ట్ర సమితి కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి

### మణుగూరులో ఉద్రిక్తత

మణుగూరు : భద్రాద్రి జిల్లా మణుగూరులో కొన్నేళ్లుగా వివాదంలో ఉన్న భారత రాష్ట్ర సమితి కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆదివారం ఉదయం పట్టణంలోని భారత రాష్ట్ర సమితి కార్యాలయంలోకి భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు ప్రవేశించారు. అందులోని కరపత్రాలు, డైరీలు, జెండాలు, ఫర్నిచర్, కంప్యూటర్ బయటకు తీసుకొచ్చి నిప్పుపెట్టారు. అనంతరం నినాదాలు చేస్తూ కార్యాలయంపై ఉన్న 'తెలంగాణ భవన్' అనే పేరును చెరిపేసి దానిపై 'ఇందిరమ్మ భవన్' అని రాశారు. అక్కడ కాంగ్రెస్ జెండాలను ఎగురవేసి 'ఇందిరమ్మ భవన్' అనే ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. ఆ

- మిగతా 4 లో..

# నేటి నుంచి ఎస్ఎల్‌బీసీ హెలికాప్టర్ సర్వే

### సొరంగం తవ్వకాల పునరుద్ధరణకు నిర్వహణ

### స్వయంగా పర్యవేక్షించనున్న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

### నేడు నాగర్‌కర్నూలు జిల్లా మన్నేవారిపల్లికి పయనం

### భూగర్భంలో 1,000 మీటర్లలోతు వరకు అధ్యయనం

శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం తవ్వకాల పనుల పునరుద్ధరణలో భాగంగా సోమవారం నుంచి హెలికాప్టర్ బోర్న్ వీటెమ్ ప్లస్ మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వేను ప్రారంభించనున్నారు. సర్వే నిర్వహణకు పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

హైదరాబాద్: ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం స్వయంగా నాగర్ కర్నూలు జిల్లా మన్నేవారిపల్లికి చేరుకుని సర్వేను పర్యవేక్షిస్తారు. సర్వే జరిపే హెలికాప్టర్‌కు సమాంతరంగా మరో హెలికాప్టర్‌లో సీఎం, మంత్రి ప్రయాణిస్తూ సర్వే ప్రక్రియను పరిశీలించనున్నారు. నేషనల్ జియో ఫిజికల్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సర్వేలో భాగంగా దాదాపు 200 కి.మీ.ల విస్తీర్ణంలో సొరంగం తవ్వకాలు జరగాల్సిన ప్రాంతంలో భూగర్భంలో 800–1,000 మీటర్ల లోతు వరకు ఎలాంటి పరిస్థితులు ఉన్నాయనేది గుర్తిస్తారు. గత ఫిబ్రవరిలో సొరంగం కుప్పకూలిన ఘటనలో కార్మికులు మరణించటంతోపాటు టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) ధ్వంసమైంది. దీంతో సురక్షిత పద్ధతిలో సొరంగం తవ్వకాలను పునరుద్ధరించడానికి

-మిగతా 4 లో..



### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను

# ఆషామాషిగా తీసుకోవద్దు

### ఈ ఎన్నికతో మనందరి భవిష్యత్ ముడిపడి ఉంది

### బూత్ స్థాయి మేనేజ్‌మెంట్ పకడ్బందీగా జరగాలి

### మంత్రులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ఆషామాషీగా తీసుకోవద్దని మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ ఎన్నిక ఫలితంతో తనతోపాటు మంత్రులందరి భవిష్యత్తు ముడిపడి ఉందని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఉప ఎన్నిక ఫలితం సానుకూలంగా వస్తుందనే ధీమాతో ఉండొద్దని, మంత్రులు ఈ ఎన్నికను చాలా సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించినట్టు సమాచారం. ఆదివారం మధ్యాహ్నం తన క్యాంపు కార్యాలయం సమీపంలో ఆయన కేబినెట్ సహచరులకు లంచ్ ఏర్పాటు చేశారు.



హైదరాబాద్: అంతకుముందు దాదాపు గంటన్నరకు పైగా అక్కడే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార సరళిని ఆయన సమీక్షించారు. ఈ సమీక్షలో సీఎం మాట్లాడుతూ.. ఉప ఎన్నికలో గెలవాల్సిన

-మిగతా 4 లో..



## బిసి రిజర్వేషన్లపై పోరాటాన్నీ పల్లె పల్లెకు విస్తరించాలి

### నవంబర్‌లో పార్లమెంటు ముట్టడి చేపడతాం

### బిసి రిజర్వేషన్లపై రాజీలేని పోరాటం చేస్తాం

### 42% రిజర్వేషన్ల సాధనకు 'అష్టాంగ' ఆందోళనలు

### బీసీ ఐకాస విస్తృతస్థాయి సమావేశంలో నేతల నిర్ణయం

హైదరాబాద్: బీసీలకు 42% రిజర్వేషన్ల సాధనకు ఈ నెల 6 నుంచి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నట్లు బీసీ ఐకాస నేతలు వెల్లడించారు. వచ్చే 3 నెలలపాటు గల్లీ నుంచి ఢిల్లీ వరకు 8 రకాల ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఇందుకు గౌతమ బుద్ధుడి స్ఫూర్తితో 'అష్టాంగ' ఆందోళనలుగా నామకరణం చేశామని తెలిపారు. బీసీ ఉద్యమ కార్యాచరణపై ఆదివారం బంజారాహిల్స్‌లోని కళింగ భవనంలో ఐకాస, పలు

-మిగతా 4 లో..

## పేదోడికి ఒక న్యాయం.. పెద్దోడికి ఒక న్యాయమా?

### హైడ్రా బుల్డోజర్లు పేదల కుటుంబాలను వీధిన పడేశాయి

### బాధితులందరికీ అండగా నిలుస్తాం

### రేవంత్‌రెడ్డి చేసిన పని కూలగొట్టడమే..

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ : హైడ్రా బుల్డోజర్లు పేదల ఇళ్లను కూల్చేశాయని, ఎన్నో కుటుంబాలను వీధిన పడేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మరో 500 రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ వస్తుందని, హైడ్రా కూల్చివేతలతో అన్యాయానికి గురైన బాధితులందరికీ అండగా నిలుస్తామని ఆయన పేర్కొన్నారు. 'పెద్దవాళ్లకు ఒక

-మిగతా 4 లో..

## ధైర్యముంటే సన్న బియ్యం పథకాన్ని రద్దు చేయండి

### సీఎం రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి సవాల్

### ముఖ్యమంత్రి హద్దులు దాటి మాట్లాడుతున్నారని ధ్వజం



హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి హద్దులు దాటి మాట్లాడుతున్నారని... కాంగ్రెస్‌కు ఓటేయకపోతే సన్న బియ్యం పథకాన్ని రద్దు చేస్తామని బెదిరించారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఇది కేంద్ర

-మిగతా 4 లో..




# ప్రపంచకప్ మనదే..

## మహిళల వరల్డ్‌కప్-2025 విజేతగా భారత్

### చరిత్ర సృష్టించిన భారత అమ్మాయిలు

### దీప్తి శర్మ, షఫాలీ వర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శన

**భారత మహిళల జట్టు 47 ఏళ్ల తమ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. ఐసీసీ మహిళల ప్రపంచకప్-2025 విజేతగా భారత్ నిలిచింది. ఆదివారం నవీ ముంబై వేదికగా జరిగిన ఫైనల్లో సౌతాఫ్రికాను 52 పరుగుల తేడాతో చిత్తు చేసిన టీమిండియా.. తొలి వరల్డ్‌కప్ టైటిల్‌ను ముద్దాడింది. 299 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా 45.3 ఓవర్‌లో 246 పరుగులకు ఆలౌటైంది.**

ముంబయి: సెమీస్‌లో సూపర్ విక్టరీతో ఫైనల్‌లో అడుగుపెట్టిన భారత్.. ఫైనల్‌లోనూ మరుపురాని ప్రదర్శన చేసింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. ఓపెనర్ షెఫాలీ వర్మ (87, 78 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (58, 58 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), స్మృతి మంధాన (45, 58 బంతుల్లో 8 ఫోర్లు) రాణించడంతో దక్షిణాఫ్రికాకు భారత్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం 299 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 45.3 ఓవర్లలో 246 పరుగులకు పరిమితం అయింది. కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) ఒంటరి పోరాటం చేసింది. అనెరి డెర్క్‌సెన్ (35), తజ్మిన్ బ్రిట్స్ (23), సునె లూస్ (25) పరుగులు చేశారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ 5, షెఫాలీ వర్మ 2, శ్రీ చరణి ఒక్కో వికెట్ తీశారు.



### ఐదేసిన దీప్తి..

ఇక భారత్ తొలిసారి వరల్డ్‌కప్‌ను సొంతం చేసుకోవడంలో స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మది కీలక పాత్ర. తొలుత బ్యాటింగ్‌లో హాఫ్ సెంచరీతో మెరిసిన దీప్తి.. బౌలింగ్‌లో బంతితో అద్భుతం చేసింది. ఈ యూపీ క్రికెటర్ ఐదు వికెట్లతో ప్రోటీస్ పతనాన్ని శాసించింది. 9.3 ఓవర్లు బౌలింగ్ చేసిన శర్మ..39 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టింది. మొత్తంగా 17 వికెట్లతో దీప్తి ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్‌గా నిలిచింది.




దీప్తి శర్మ

షఫాలీ వర్మ

### సౌతాఫ్రికా కెప్టెన్ ఒంటరి పోరాటం..

సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ ఒంటరి పోరాటం చేసింది. 98 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్స్ సాయంతో 101 పరుగులు చేసింది. లారా క్రీజులో ఉన్నంతసేపు భారత డగౌట్‌తో పాటు అభిమానులలో టెన్షన్ నెలకొంది. దీప్తీ శర్మ బౌలింగ్‌లో వోల్వార్ట్ ఔట్ కావడంతో భారత విజయం ఖాయమైంది. అమన్ జ్యోత్ కౌర్ అద్భుత క్యాచ్‌తో వోల్వార్ట్ పెవిలియన్‌కు పంపించింది.



### ఈ విజయం భవిష్యత్తు ఛాంపియన్లకు స్ఫూర్తి : ప్రధాని మోదీ

మహిళ ప్రపంచకప్ ఫైనల్‌లో భారత జట్టు అద్భుత విజయం సాధించింది. ఫైనల్‌లో గొప్ప నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో ఆటగాళ్లు ప్రదర్శన చేశారు. టోర్నీ ఆసాంతం ఆటగాళ్లు అసాధారణ సమష్టి కృషి, పట్టుదలను ప్రదర్శించారు. భారత క్రీడాకారులకు అభినందనలు. ఈ చారిత్రాత్మక విజయం భవిష్యత్తు ఛాంపియన్లకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

### శెభాష్ షఫాలీ..

ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ షఫాలీ వర్మతో బ్యాట్‌తో బంతితో మ్యాజిక్ చేసింది. భారీ లక్ష్య చేధనలో 51 పరుగుల వద్ద సౌతాఫ్రికా తొలి వికెట్ కోల్పోయింది. బ్రిట్స్ రనౌట్ రూపంలో వెనుదిరిగింది. అనంతరం క్రీజులోకి వచ్చిన బోష్ కూడా ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరింది. ఈ సమయంలో సౌతాఫ్రికా కెప్టెన్ లారా.. వన్ డౌన్ బ్యాటర్ లూస్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పింది. భారత కెప్టెన్ హర్మన్ ఎంత మంది బౌలర్లను మార్చిన ఫలితం లేకపోయింది. దీంతో పార్ట్ టైమ్ బౌలర్ షఫాలీకి హర్మన్ బంతిని అందించింది. కెప్టెన్ నమ్మకాన్ని షఫాలీ వమ్ము చేయలేదు. అద్భుతమైన సన్నీ లూస్‌ను షఫాలీ బోల్తా కొట్టించింది. ఆ తర్వాత డేంజరస్ బ్యాటర్ కాప్‌ను కూడా వర్మ పెవిలియన్‌కు పంపింది. రెండు కీలక వికెట్లు పడగొట్టి భారత్‌ను వరల్డ్ ఛాంపియన్‌గా షఫాలీ నిలిపింది.

## ఘర్షణలతో బిజీగా ఉంచాలనేది భారత్ వ్యూహం

### పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఆరోపణలు



**పాకిస్థాన్ :** అఫ్గాన్‌తో ఘర్షణల నేపథ్యంలో పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ భారత్‌పై నిందలు మోపారు. ఘర్షణలతో తమను బిజీగా ఉంచాలనే వ్యూహాలను భారత్ అనుసరిస్తోందని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఆరోపించారు. అఫ్గాన్‌తో ఘర్షణల విషయంపై ఖవాజా పదే పదే భారత్‌పై నిందలు మోపేందుకు ప్రయత్నిస్తున్నారు. అఫ్గాన్‌తో తాజా ఘర్షణలు ఆపేందుకు ఖతార్, తుర్కియే చేస్తున్న మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ఆశాజనకంగా ఉన్నాయని ఖవాజా అన్నారు. అయితే, తూర్పు, పశ్చిమ సరిహద్దుల ఘర్షణల్లో తాము నిమగ్నమయ్యేలా భారత్ ప్రణాళికలు రచిస్తోందని ఆరోపించారు. అఫ్గాన్ ఘర్షణలు, ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అఫ్గానిస్థాన్ మాజీ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ కాలం నుంచి భారత్ తమపై పరోక్ష యుద్ధం చేస్తోందని ఆరోపించారు. దీనికి సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. అవసరమైతే వాటిని బయటపెడతామన్నారు. ఇంతకు ముందు కూడా భారత్ తరపున అఫ్గాన్ పరోక్ష యుద్ధం చేస్తోందంటూ ఆసిఫ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా తమ దేశంలో అఫ్గాన్ వాసులు అక్రమంగా ఉండటాన్ని పాక్ అంతర్జాతీయ స్థాయిలో లేవనెత్తిందని ఆసిఫ్ పేర్కొన్నా రు. అఫ్గాన్ నుంచి ఏదైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరిగితే.. దానికి ఆ దేశమే జవాబు దారీగా ఉంచే నిబంధనలు చర్చల్లో ఉన్నాయన్నారు. తమవైపు నుంచి ఎలాంటి శత్రు కార్యకలాపాలు జరగడం లేదన్నారు. అఫ్గానే కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇటీవల పాక్–అఫ్గాన్ సరిహద్దుల్లో నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించా యి. ఈ క్రమంలో కాల్పుల విరమణ కొనసాగింపునకు రెండు దేశాలు ఇటీవల అంగీకరించాయి. వీటి మధ్య సయోధ్య కుదిర్చేందుకు తుర్కియే, ఖతార్‌లు ప్రయత్ని స్తున్నాయి. నవంబరు 6న ఇరుదేశాల మధ్య మరోసారి చర్చలు జరగనున్నాయి.



## మెక్సికోలో భారీ పేలుడు.. 23 మంది మృతి

**మెక్సికో :** మెక్సికోలోని ఓ సూపర్‌మార్కెట్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. 12 మంది గాయపడ్డారు. శనివారం హెర్మోసిల్లోలోని వాల్డో సూపర్‌మార్కెట్‌లో ఈ ఘటన జరిగింది. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర గవర్నర్ అల్ఫోన్సో దురాజో ఈ ఘటనను ధ్రువీకరించారు. పేలుడు సంభవించిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పేలుడుకు గల స్పష్టమైన కారణం ఇంకా తెలియరాలేదు. ప్రమాద ఘటనపై అల్ఫోన్సో ఓ వీడియోలో మాట్లాడారు. ఇది చాలా బాధాకరమైన ఘటన అని.. ప్రియమైనవారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తాము అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ ఎక్స్ ద్వారా దీనిపై స్పందించారు. ఈ ప్రమాద ఘటన తనను కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రాష్ట్ర గవర్నర్ అల్ఫోన్సోతో మాట్లాడినట్లు తెలిపారు. సహాయక చర్యల కోసం రెస్క్యూ సిబ్బందిని పంపించాలని అంతర్గత వ్యవహారాల కార్యదర్శి రోసా ఐసెలా రోడ్రిగ్జ్‌ను ఆదేశించినట్లు తెలిపారు.



## హార్వర్డ్ మెడికల్ స్కూల్లో పేలుడు..

### ఉద్దేశపూర్వకంగా చేసిందే : ఎఫ్‌బీఐ

**యూఎస్ :** అమెరికాలో హార్వర్డ్ మెడికల్ స్కూల్లో పేలుడు ఘటన తీవ్ర కలకలం రేపుతుంది. ఈ ఘటన ఉద్దేశపూర్వకంగా చేసిందేనని ఎఫ్‌బీఐ స్పష్టం చేసింది. ఈ పేలుడులో ఎవరూ గాయపడలేదని తెలిపింది. శనివారం తెల్లవారుజామున బోస్టన్‌లోని హార్వర్డ్ మెడికల్ స్కూల్ భవనంలో ఈ పేలుడు చోటుచేసుకుంది. ఫైర్ అలారం మోగడంతో విశ్వవిద్యాలయం పోలీసు అధికారులు వెంటనే స్పందించారు. అక్కడి నుంచి తప్పించుకున్న ఇద్దరు దుండగుల సీసీ టీవీ దృశ్యాలను పోలీసులు విడుదల చేశారు. ఇది ఉద్దేశపూర్వకంగానే జరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై ఎఫ్‌బీఐ దర్యాప్తు ప్రారంభించింది. నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. అనుమానితుల వివరాలను వెల్లడించలేదు. దేని కారణంగా పేలుడు సంభవించిందనేది కూడా చెప్పలేదు.



## విరిగిపడిన కొండ చరియలు..

### 21 మంది మృతి

**కెన్యా:** ఆఫ్రికా దేశం కెన్యాలో విషాదం చోటు చేసుకుంది. కొండచరియలు విరిగిపడి 21 మంది చనిపోగా, 30 మందికి పైగా గల్లంతయ్యారు. దక్షిణ కెన్యా ప్రాంతంలోని మారాక్‌వెట్ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో కొండచరియలు విరిగిపడ్డాయని దేశ అంతర్గత వ్యవహారాల మంత్రి వెల్లడించారు. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టామని సదరు మంత్రి తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అక్కడ వర్షాకాలం కావడంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

## 'సీఎంఎస్-03' ప్రయోగం విజయవంతం

### నిర్ణీత కక్ష్యలోకి భారీ ఉపగ్రహం



**శ్రీహరికోట :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ నిర్వహించిన 'సీఎంఎస్–03' ప్రయోగం విజయవంతమైంది. 'ఎల్‌వీఎం3–ఎం5' వాహక నౌక ద్వారా ఈ సమాచార ఉపగ్రహాన్ని జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఈ మేరకు ఇస్రో ఛైర్మన్ నారాయణన్ ప్రకటన చేశారు. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఆదివారం సాయంత్రం 5.26 నిమిషాలకు ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ఉపగ్రహం బరువు 4,410 కిలోలు. భారత భూభాగం నుంచి స్వదేశీ రాకెట్ ద్వారా ఈ కక్ష్యలోకి ప్రయోగించిన శాటిలైట్లన్నింటిలోకీ ఇదే అత్యంత బరువైనది. "సీఎంఎస్–03 ప్రయోగం విజయవంతం కావడం ఆనందంగా ఉంది. ఇందులో కీలక పాత్ర పోషించిన అందరికీ అభినందనలు. ఈ ప్రయోగంతో భారత్ మరో ఘనత సాధించింది. శాస్త్రవేత్తలు, సిబ్బంది కృషి వల్లే ఇదంతా సాధ్యమైంది. ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఇస్రో అడుగులు వేస్తోంది" అని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. సీఎంఎస్–03 ఉపగ్రహం ద్వారా సమాచార వ్యవస్థ మెరుగుపడటంతో పాటు సముద్ర వాతావరణ పరిస్థితులను తెలుసుకునే వెసులుబాటు కలగనుంది. ప్రధానంగా భారత నౌకాదళం కోసం దీన్ని రూపొందించారు. సాగర జలాల్లో మోహరించిన మన యుద్ధనౌకలు, జలాంతర్గాములు, భూ నియంత్రణ కేంద్రాలతో భద్రమైన కమ్యూనికేషన్లు సాగించేందుకు ఈ శాటిలైట్ తోడ్పాటు అందిస్తుంది. భారత తీరం నుంచి 2వేల కిలోమీటర్ల దూరం వరకూ విస్తరించిన సాగరజలాల్లో సేవలు అందించగలదు. దీన్ని జీశాట్–7ఆర్ అని కూడా పిలుస్తారు. 2013 నుంచి సేవలు అందిస్తున్న జీశాట్–7 స్థానంలో దీన్ని ప్రయోగించారు.

## జంగల్‌రాజ్‌ను బిహార్ ప్రజలు మర్చిపోలేదు

### ప్రధాని నరేంద్ర మోదీ



**బిహార్ :** 'ఆపరేషన్ సిందూర్' షాక్ నుంచి పాకిస్థాన్, కాంగ్రెస్‌లు ఇంకా కోలుకోలేకపోయాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆ ఆపరేషన్ సమయంలో దాయాది దేశంలో ఉగ్రస్థావరాలపై బాంబులు పడుతుంటే.. ఇక్కడ కాంగ్రెస్ రాజ కుటుంబం నిద్రలేని రాత్రులు గడిపిందన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆరాలో నిర్వహించిన ప్రచార సభలో ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. 'జంగల్‌రాజ్'ను బిహార్ ప్రజలు మర్చిపోలేదని, ఆ నేతలు చరిత్రలోనే అత్యంత దారుణమైన ఓటమిని చవిచూడబోతున్నారని చెప్పారు.

**'తుపాకీ ఎక్కుపెట్టి సీఎం అభ్యర్థిత్వం'..**

"ఆర్జేడీకి అనుకూలంగా సీఎం అభ్యర్థిని ప్రకటించాలని కాంగ్రెస్ అనుకోలేదు. తేజస్వీ యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా అంగీకరించేందుకు హస్తం పార్టీ ఎప్పుడూ సిద్ధంగా లేదు. కానీ.. కాంగ్రెస్ తలపై తుపాకీ ఎక్కుపెట్టి మరీ ఆర్జేడీ ఆ అవకాశాన్ని దక్కించుకుంది. ఎన్నికల అనంతరం ఆ పార్టీల నేతలు పరస్పరం పోట్లాడుకుంటారు. మహా కుంభమేళాను ఇరు పార్టీల నేతలు అవమానించారు. ఓ కాంగ్రెస్ నేత ఛత్ పూజను అపహాస్యం చేశారు. ఇకపై ఎవరూ అలా చేసేందుకు ధైర్యం చేయనంతగా వారికి గుణపాఠం నేర్పాలి"

**'చొరబాటుదారులను తరిమికొట్టాలి'..**

ఇందిరా గాంధీ హత్య అనంతరం చెలరేగిన హింసను ప్రస్తావిస్తూ.. "1984లో దాదాపు ఇదే సమయంలో దిల్లీలో సిక్కులను ఊచకోత కోశారు. ఈ మారణహోమం విషయంలో కాంగ్రెస్ ఇంకా క్షమాపణ చెప్పలేదు. దోషులను ప్రోత్సహిస్తోంది" అని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటరు అధికార్ యాత్ర'ను పరోక్షంగా ఉటంకిస్తూ.. చొరబాటుదారులను కాపాడేందుకే ఈ ర్యాలీ నిర్వహించారని, వారిని తరిమికొట్టాలన్నారు. ఎన్డీయే మేనిఫెస్టోలో నిజాయతీ, దార్శనికత కనిపిస్తోందని, ప్రతిపక్షాల హామీల పత్రం మొత్తం అబద్ధాలతో నిండి ఉందని విమర్శించారు.

## ట్రంప్ ఎప్పుడేం చేస్తారో ఆయనకే తెలియదు : ఉపేంద్ర ద్వివేది



**న్యూఢిల్లీ :** భవిష్యత్తులో ఎదురయ్యే అనిశ్చితులు, భద్రతా సవాళ్లను ఎదుర్కొనేలా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని భారత ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని.. పాత సమస్యలు పరిష్కరించుకునేలోపే కొత్తవి వస్తున్నాయన్నారు. ప్రపంచ దేశాల మధ్య.. ఏ సమయంలో ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ రోజు ఏం చేస్తున్నారు.. రేపు ఏం చేయబోతున్నారు..? అనే విషయం ఆయనకు కూడా తెలియకపోవచ్చని ద్వివేది వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లోని ఓ కార్యక్రమానికి హాజరైన ద్వివేదీ మాట్లాడుతూ.. గతంలో వ్యతిరేక భావజాలం, భూభాగాల స్వాధీనం కోసం చేసే యుద్ధాలు అందరి కళ్లకు కనిపించేవని.. ప్రస్తుతం కొత్త వ్యూహాలతో దేశాలు పరస్పరం యుద్ధ వాతావరణాన్ని సృష్టించుకుంటున్నాయని అన్నారు. ఉగ్రవాదం, ప్రకృతి వైపరీత్యాలు, సైబర్ దాడులు, తప్పుడు ప్రచారాల వంటి సవాళ్లను మన సైన్యం ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో తాము కేవలం పాక్‌లోని ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని.. అయితే ఆ దేశ పౌరుల పైనా దాడులకు పాల్పడినట్లు సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం అయ్యాయని అన్నారు. ఇలాంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే సైన్యం ఆయుధ పరంగానే కాకుండా టెక్నాలజీ పరంగానూ మరింత ముందుకు వెళ్లాలన్నారు. ఆపరేషన్ సిందూర్ నుంచి నేర్చుకున్న పాఠాలతో ఆధునిక ఘర్షణలను ఎదుర్కోవడానికి భారత్ సమాయత్తమవుతుందని ద్వివేది తెలిపారు. ఇందుకోసం త్రివిధ దళాలు కలిసి పనిచేస్తున్నాయన్నారు. ప్రపంచంలోని పలు దేశాల మధ్య యుద్ధాలను ఆపుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరచూ గొప్పలు చెప్పుకోవడం, ప్రపంచ దేశాలపై ఇష్టానుసారం సుంకాలు విధించడం వంటి చర్యల నేపథ్యంలో ద్వివేది ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## హైవేలపై ప్రమాదాలు..

### ఇక కాంట్రాక్టర్లకు భారీ జరిమానా




**న్యూఢిల్లీ :** జాతీయ రహదారులపై ప్రమాదాలు, మరణాలను తగ్గించే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జాతీయ రహదారిలోని నిర్దిష్ట ప్రాంతంలో సంవత్సరంలో ఒకటి కంటే ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తే సంబంధిత కాంట్రాక్టర్లకు భారీ జరిమానా విధించాలని రహదారుల మంత్రిత్వ శాఖ నిర్ణయించినట్లు తెలిసింది. బిల్డ్–ఆపరేట్–ట్రాన్స్‌ఫర్ విధానంలో నిర్మించే రహదారులకు దీన్ని వర్తింపజేయనున్నట్లు ఓ సీనియర్ అధికారి మీడియాకు వెల్లడించారు. బీవోటీ విధానంలో నిర్మించే హైవేలపై ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లదేనని, వారే దిద్దుబాటు చర్యలు తీసుకోవా లని జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి బీఓటీ పత్రాన్ని సవరించామన్నారు. "నిర్దిష్ట ప్రాంతం.. 500 మీటర్ల పరిధిలో ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ ప్రమాదాలు జరిగితే కాంట్రాక్టరుకు రూ.25 లక్షల జరిమానా విధిస్తాము. మరుసటి ఏడాది ప్రమాదం జరిగితే ఇది రూ.50లక్షలకు పెరుగుతుంది" అని చెప్పారు. హైవే మంత్రిత్వశాఖ పరిధిలో ఇటువంటి ప్రమాద ముప్పు ఉన్న 3500 ప్రాంతాలు ఉన్నాయన్నారు.

## హింసను సహించే ప్రసక్తే లేదు

### బిహార్ ఘటనపై ఈసీ



**బిహార్ :** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ ఇటీవల జన్ సురాజ్ కార్యకర్త హత్యకు గురైన ఘటన నేపథ్యంలో ఎన్నికల సంఘం స్పందించింది. హింసను సహించేది లేదని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొంది. ప్రజాస్వామ్య పండుగలో పాల్గొనాలని బిహార్ ఓటర్లకు విజ్ఞప్తి చేసింది. "బిహార్‌లో ఎన్నికల నేపథ్యంలో హింసాత్మక ఘటనలను సహించే ప్రసక్తే లేదు. శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తాం. ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లందరికీ అవకాశం లభిస్తుంది. శాంతి భద్రతల నడుమ పోలింగ్ జరుగుతుంది" అని భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. కాన్పూర్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఎన్నికల యంత్రాంగం సంసిద్ధతపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. రిటర్నింగ్ అధికారులు, కలెక్టర్లు, ఎస్పీ, ఎన్నికల పరిశీలకులు, భద్రతా సిబ్బంది మొత్తం సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

**విదేశీ రాయబారులు పరిశీలన..**

దేశంలో ఎన్నికల ప్రక్రియ, భాజపా ఎన్నికల ప్రచారం తీరును పరిశీలించేందుకు పలు దేశాలకు చెందిన రాయబారుల బృందం బిహార్‌లో పర్యటిస్తోంది. జపాన్, బ్రిటన్, ఇండోనేసియా, డెన్మార్క్, ఆస్ట్రేలియా, భూటాన్, దక్షిణాఫ్రికా దేశాల రాయబారులు ఈ బృందంలో ఉన్నట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి. క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియను తెలుసుకోవడంతోపాటు సీనియర్ పార్టీ నేతలు, ఓటర్లతోనూ భేటీ అవనున్నట్లు సమాచారం. గతంలో గుజరాత్, హిమాచ్ ప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల సమయాల్లోనూ విదేశీ రాయబారుల బృందాలు ఆయా రాష్ట్రాల్లో సందర్శించాయి. ఇదిలాఉంటే, బిహార్‌లో 243 అసెంబ్లీ స్థానాలకు గాను రెండు దశల్లో ఎన్నికలు జరుగనున్నాయి. తొలిదశ నవంబర్ 6, రెండో దశ పోలింగ్ నవంబర్ 11న జరగనుంది.

## ఎన్నికల తర్వాత రాష్ట్రం వైపు కన్నెత్తి కూడా చూడరు

### ప్రధానిపై రాహుల్ విమర్శలు



**బిహార్:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానిపై విమర్శలు చేశారు. ఆదివారం బిహార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ మాట్లాడుతూ.. ఓట్ల కోసం ప్రధాని మోదీ ఏం చేయడానికైనా వెనకాడబోరని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ బిహార్‌కు వచ్చి అనేక ప్రసంగాలు, వాగ్దానాలు చేస్తారని.. ఎన్నికల తర్వాత రాష్ట్రం వైపు కన్నెత్తి కూడా చూడరని రాహుల్ విమర్శించారు. బిహార్‌లో ప్రధాన సమస్యగా ఉన్న నిరుద్యోగం గురించి ప్రశ్నలు లేవనెత్తకుండా.. యువత దృష్టిని మళ్లించడానికి వారిని రీల్స్ చూడాలని మోదీ కోరుతున్నారని రాహుల్ అన్నారు. రాష్ట్రంలో తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు ఉత్తమ విద్య, ఉద్యోగ అవకాశాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నలంద వంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాన్ని బిహార్‌లో ప్రారంభిస్తామన్నారు. ఇండియా కూటమిని ఎన్నుకుంటే రాష్ట్రంలో రైతులు, కార్మికులు, దళితులు, బలహీనవర్గాలకు అనుకూలమైన ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. భారత్–పాక్ సైనిక ఘర్షణను ఆపానని ట్రంప్ పదేపదే చెబుతున్నప్పటికీ.. ఆయనను నిలదీసి ప్రశ్నించే ధైర్యం మోదీకి లేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు, జీఎస్టీ సంస్కరణలు వంటి నిర్ణయాలన్నీ దేశంలోని కొందరు వ్యాపారవేత్తలకు ప్రయోజనం చేకూర్చేవేనన్నారు. కానీ తాము మాత్రం చిరు వ్యాపారులు అభివృద్ధి చెందాలనే ఆలోచనతో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాలపై మేడిన్ బిహార్ అనే ముద్రను చూడాలనుకుంటున్నామన్నారు.




## ఐఏఎస్ అకాడమీల తప్పుడు క్లెయిమ్‌లు..

### రూ.8 లక్షల జరిమానా

**న్యూఢిల్లీ :** సివిల్ సర్వీసెస్ కోచింగ్‌లో పేరున్న దీక్షంత్ ఐఏఎస్, అభిమన్యూ ఐఏఎస్ సంస్థలకు సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) భారీ జరిమానా విధించింది. ఒక్కో సంస్థకు రూ.8 లక్షల జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ రెండు సంస్థలు యూపీఎస్సీలో విజయం సాధించిన అభ్యర్థుల పేర్లను అనుమతి లేకుండా వాడినందుకు ఈ చర్యలు తీసుకొంది. ఇటీవల కోచింగ్ సెంటర్లు చేస్తున్న తప్పుడు ప్రచారాలపై సీసీపీఏ దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఎలాంటి నమ్మకమైన సమాచారం ఇవ్వకుండానే.. తమ విజయ శాతాన్ని ఈ రెండు ఐఏఎస్ కోచింగ్ సెంటర్లు ఎక్కువ చేసి చెప్పుకొంటున్నట్లు తేలింది. ఇందుకోసం యూపీఎస్సీ పరీక్షల్లో అత్యున్నత స్థాయిలో మార్కులు సాధించిన అభ్యర్థులు తమ విద్యార్థులని ప్రచారం చేసుకొన్నాయి. 2021లో ఆల్ ఇండియా ర్యాంక్ 96 సాధించిన మణి శుక్లా ఫిర్యాదు ఆధారంగా దీక్షంత్ సంస్థపై చర్యలు తీసుకొంది. ఆ సంస్థ మరో అకాడమీతో కలిసి నిర్వహించిన ఒక్క మాక్ ఇంటర్వ్యూకు మాత్రమే తాను హాజరైనట్లు మణి శుక్లా పేర్కొన్నారు. ఇక 2020 సంవత్సరం ఆలిండియా ర్యాంక్ 175 సాధించిన నటాష గోయల్ కూడా అభిమన్యూ ఐఏఎస్ అకాడమీపై ఫిర్యాదు చేశారు. తన అనుమతి లేకుండా ఫొటోను వాడినట్లు వెల్లడించారు. సదరు సంస్థను స్థాపించిన నాటి నుంచి 2,200 మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించినట్లు ఆ సంస్థ పేర్కొంది. కానీ, ఎలాంటి డేటాను ఇవ్వడంలేదు. ఆ సంస్థ 2023లో క్లెయిమ్ చేసిన 139 మంది అభ్యర్థుల్లో 88 మంది స్వయంకృషితో ఉద్యోగాలు సాధించిన వారున్నట్లు సీసీపీఏ దర్యాప్తులో తేలింది.

## పకడ్బందీగా కొత్త విత్తన చట్టం ముసాయిదా : మంత్రి తుమ్మల



**హైదరాబాద్:** రాష్ట్రంలో కొత్త విత్తన చట్టం–2025 ముసాయిదాను రైతులకు అన్నివిధాలుగా న్యాయం జరిగేలా పకడ్బందీగా రూపొందించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పంట నష్టపోయే రైతులకు సంపూర్ణ పరిహారం అందేలా చొరవ చూపాలన్నారు. ఆదివారం సచివాలయంలో కొత్త విత్తన చట్టం ముసాయిదా రూపకల్పన కమిటీతో తుమ్మల సమావేశమయ్యారు. వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి, విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, ముసాయిదా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'నాణ్యమైన విత్తనోత్పత్తికి కంపెనీలను ప్రోత్సహించేలా, మోసం చేసే వాటి పట్ల కఠినంగా వ్యవహరించేలా ముసాయిదా రూపొందించాలి. అది న్యాయ సమీక్షకు అనుగుణంగా ఉండాలి. కొత్త విత్తన చట్టం రూపకల్పన అనంతరం అవసరమైతే కేంద్ర ప్రభుత్వం ఆమోదానికి పంపుతాం' అని తుమ్మల పేర్కొన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. 'విత్తన రైతులకు రుణ సౌకర్యం, సాంకేతిక శిక్షణ వంటి అంశాలను జోడించాలి. విత్తనోత్పత్తి సంఘాల ఏర్పాటు, లైసెన్సు కలిగిన సంస్థలకే విక్రయ అనుమతివ్వాలి. రైతు, ఆర్గనైజర్, కంపెనీల మధ్య త్రైపాక్షిక ఒప్పందం ఉండాలి' అని సూచించారు.



## నేటి నుంచి ఎస్ఎల్‌బీసీ హెలికాప్టర్ సర్వే

నిపుణుల కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టులో భాగంగా రెండు వరుస సొరంగాలను నిర్మిస్తుండగా, రెండో సొరంగం తవ్వకాలు పూర్తి అయ్యాయి. ఒకటో సొరంగాన్ని మొత్తం 43.93 కి.మీ.లు తవ్వాల్సి ఉండగా, ఇన్‌లెట్ వైపు నుంచి 13.94 కి.మీ.లు, దేవరకొండ వద్ద ఉన్న అవుట్ లెట్ వైపు నుంచి 20.4 కి.మీ.లు తవ్వారు. మధ్యలో 9.8 కి.మీ. ల సొరంగాన్ని తవ్వాల్సి ఉంది. తవ్వకాలు పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత పొడవైన మానవ నిర్మిత సొరంగంగా ఇది రికార్డు సృష్టించనుంది.

### సర్వే ఇలా చేస్తారు..

24 మీటర్ల వ్యాసం కలిగిన ట్రాన్స్‌మీటర్ లూప్‌ను హెలికాప్టర్‌కు వేలాడదీసి సొరంగం తవ్వాల్సిన ప్రాంతంపై గాల్లో ఎగరడం ద్వారా ఈ సర్వే జరపనున్నారు. విద్యుత్ అయస్కాంత తరంగాలను ట్రాన్స్ మీటర్ భూమిలోకి పంపిస్తుంది. అవి భూగర్భంలోని పొరలకు తాకి పరావర్తనం చెందుతాయి. తిరిగివచ్చే తరంగాలను రిసీవర్ ద్వారా గ్రహించి భూగర్భంలో ఎలాంటి నిర్మాణం ఉందో అంచనా వేస్తారు. 800–1,000 మీటర్ల లోతులో ప్రమాదకర పరిస్థితులు (షీర్ జోన్) ఉన్నాయా? నీళ్లు ఉన్నాయా? అనే అంశాలను నిపుణులు అధ్యయనం చేసి సొరంగం తవ్వకాలకు ఎలాంటి టెక్నాలజీ వినియోగించాలనేది సూచించనున్నారు.



## ధైర్యముంటే సన్న బియ్యం పథకాన్ని రద్దు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం పథకమని... ధైర్యముంటే రద్దు చేసి చూపాలని సవాల్ విసిరారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. పార్టీ అభ్యర్థి దీపక్‌రెడ్డితో కలిసి యూసుఫ్‌గూడ సమీపంలోని కృష్ణకాంత్ పార్కులో పర్యటించి... యోగా సాధకులు, కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముచ్చటించారు. షేక్‌పేట డివిజన్ పరిధిలోని నాలా అంబేద్కర్‌నగర్, బీజేఆర్‌నగర్, ఎంజీనగర్‌లలో సాయంత్రం ఇంటింటి ప్రచారం చేశారు. ఆయా సందర్భాల్లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. "జూబ్లీహిల్స్‌లో మజ్లిస్ అభ్యర్థిని కాంగ్రెస్ అద్దెకు తెచ్చుకుని నిలబెట్టినా.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చినా.. గెలుస్తామో లేదోనన్న అనుమానంతో, భయంతో.. కాంగ్రెస్‌కు ఓటేయకపోతే సన్న బియ్యం పంపిణీ మానేస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బెదిరించడం సరికాదు. దేశవ్యాప్తంగా 83 కోట్ల మంది ప్రజలకు ఉచిత బియ్యం పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. ప్రతి కిలోకు రూ.42 చొప్పున ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.15 మాత్రమే భరిస్తోంది. ఆయన వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాం. హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైంది. భాజపాపై అబద్ధాల ప్రచారంతో ఓ వర్గం ఓట్లు రాబట్టుకోవాలని కుట్ర పన్నుతోంది. దేశ సైనికులపై అవమానకర వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిలకు అలవాటే. సైనికులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందే. జూబ్లీహిల్స్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేసి, రోడ్లు వేసిన తర్వాతే సీఎం ఓట్లు అడగాలి. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిల మధ్య దిల్లీ స్థాయిలో ఒప్పందం కుదిరింది. అందుకే ఏ రోజూ భారత రాష్ట్ర సమితికి, కేసీఆర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ మాట్లాడటం లేదు. ఒక్క కేసులోనూ భారత రాష్ట్ర సమితిపై చర్యలు లేవు. మెట్రో రైలును అడ్డుకుంటున్నారంటూ నాపై రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. మెట్రో నడపలేమని ఎల్ అండ్ టీ చెబుతోంది. ఆ సంస్థ ఎండీతో మీరే ఫొటోలు దిగారు. మెట్రోను టేకోవర్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ఆ ప్రక్రియ పూర్తి చేయకుండా నన్ను ఆడిపోసుకోవడం ఎంత వరకు సమంజసం. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కన్నా కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి, ఎంఐఎంలకు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం. మూడు పార్టీల కుమ్మక్కు రాజకీయాలు ప్రజలకు అర్థమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో వారు విసుగు చెందారు. సమస్యల పరిష్కారం భాజపాతోనే సాధ్యం" అని కిషన్‌రెడ్డి అన్నారు.

# రేవంత్ పాలనలో అభివృద్ధి నిల్

- అందుకే ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ అట్టడుగున ఉంది
- పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రాభివృద్ధితో గ్రామీణ, నగరవాసుల మన్నన పొందాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో అభివృద్ధి శూన్యమని.. అందుకే అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ అట్టడుగున నిలిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా తమ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ఆదివారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లోని ఆదిత్య ఇంప్రెస్ గేటెడ్ కమ్యూనిటీలో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్‌రెడ్డి పాలనను ఎండగట్టారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాభివృద్ధితో గ్రామీణ ప్రజలతోపాటు హైదరాబాద్‌వాసుల మన్ననలు పొందారని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణకు ముందు అపార్ట్‌మెంట్లలో జనరేటర్లు, వాటర్ ట్యాంకర్లు లెక్కకు మించి ఉండేవని.. తమ పాలనలో అవన్నీ మాయమయ్యాయన్నారు. కేసీఆర్ కరెంటు కోతలకు చెక్ పెట్టడమే కాకుండా కృష్ణా, గోదావరి నీటిని నగర ప్రజలకు అందించారని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో ఐటీ ఉద్యోగాల కోసం వేలాది మంది హైదరాబాద్ వచ్చారన్నారు. కోవిడ్ సమయం లోనూ ఒక్క హైదరాబాద్‌లోనే 42 ఫ్లైఓవర్లు నిర్మించినట్లు చెప్పారు.

### కాంగ్రెస్ పాలనలో నత్తనడకన అభివృద్ధి

రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్‌లో అభివృద్ధి నత్తనడకన సాగుతోందని కేటీఆర్ విమర్శించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజారవాణా అభివృద్ధి చెందలేదన్నారు. ఆరు గ్యారంటీలంటూ ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లోని ఒక్క సీట్లోనూ గెలవలేకపోయిన కాంగ్రెస్ పార్టీ.. పరువు కాపాడుకోవడానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిచేందుకు అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇందుకోసం ఎంఐఎంకు బానిసగా మా రి ఆ పార్టీ షరతులన్నింటినీ ఒప్పుకుందని దుయ్యబట్టారు.

### నగరవాసులు ఓటేయకుంటే రిగ్గింగ్‌కు అవకాశం

నగరవాసుల ఓటింగ్ సరళిలోనూ మార్పు రావాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. విద్యావంతులు, ఉద్యోగులు ఎక్కువగా ఉండే హైదరాబాద్ నగరంలో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటోందన్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రాకపోతే రిగ్గింగ్ జరిగే అవకాశం ఉంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

### ఎన్నికల ప్రసంగాల కోసం.. సైన్యాన్ని అవమానిస్తారా..?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారతీయ సైన్యంపై చేసిన అవమానకర, దిగజారుడు వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. 'యూనిఫాం ధరించిన వీరులు సరిహద్దుల్లో అత్యంత క్రూరమైన పరిస్థితుల్లో కష్టపడుతుంటేనే మనం సురక్షితంగా జీవించగలుగు తున్నాం. ఎన్నికల ప్రసంగం కోసం భారతీయ సైన్యాన్ని తక్కువ చేసి పాకిస్తాన్‌ను పొగడటం ఏమిటి.. భారతీయ సైన్యానికి క్షమాపణ చెప్పి మీ మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను. నోట్ల కట్టలతో పట్టుబడిన వ్యక్తి గూండాలను, రౌడీ షీటర్లను ఆరాధించడం సహజమే. కానీ తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తిగా కొంచెం మర్యాదగా ప్రవర్తించండి. తెలంగాణ ప్రతినిధిగా మీరు బాధ్యతాయుతంగా ప్రవర్తించి, సైనికులను గౌరవించాలి' అని కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ఆషామాషిగా తీసుకోవద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆవశ్యకతను మంత్రులకు వివరించారు. జూబ్లీహిల్స్ ఎన్నిక జరుగుతున్న తీరును అధిష్ఠానం కూలంకషంగా పరిశీలిస్తోందని, డివిజన్లవారీగా బాధ్యతలు తీసుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల ఛైర్మన్ల పనితీరు గురించి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటోందని చెప్పారు. డివిజన్లు, బస్తీలతో సహా బూత్ స్థాయిలో ప్రచార మేనేజ్‌మెంట్ పకడ్బందీగా జరగాలని, ఈ వారం రోజులపాటు ప్రతి మంత్రి ఉప ఎన్నికను సీరియస్‌గా తీసుకుని పనిచేయాలని సూచించారు. 'ఈ ఎన్నికల్లో ఓడినా, గెలిచినా సీఎంగా నా ఒక్కడిపైనే ప్రభావం ఉండదు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజల్లో ఓ ఇమేజ్ కల్పిస్తుంది. ఈ ఎన్నికలో సానుకూల ఫలితం రాకపోతే నాతోపాటు వ్యవస్థకు నష్టం చేస్తుంది. డూ ఆర్ డై తరహాలో ఈ ఎన్నికను తీసుకోవాలి. తూతూమంత్రపు వ్యవహారాలకు స్వస్తి చెప్పి మీ సొంత ఎన్నికలా తీసుకుని పనిచేయండి. మంచి మెజార్టీతో ఈ ఎన్నికలో గెలవాలి'అని దిశానిర్దేశం చేశారు.

### కౌంటర్లు ఇవ్వకపోతే ఎలా?

ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టండంలో, సోషల్ మీడియా ప్రచారంలో ఆశించిన మేర మంత్రులు పనిచేయడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. బీఆర్ఎస్ పదేళ్లలో చేసిన విధ్వంసాన్ని అధిగమిస్తూ రాష్ట్ర ప్రజలకు అవసరమైన అన్ని కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని, హైదరాబాద్ నగరంలో గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఈ విషయాలను జూబ్లీహిల్స్ ఓటర్లకు వివరంగా చెప్పాలని మంత్రులకు సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని ఆదేశించారు. సోషల్‌మీడియాలో బీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు స్వయంగా మంత్రులే సోషల్ మీడియాను పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వారియర్లను అప్రమత్తం చేయాలని కోరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న ఆరోపణలను వెంటనే తిప్పికొట్టేలా ప్రణాళిక రూపొందించుకోవాలని, సెంటిమెంట్‌ను ఉపయోగించుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్ ప్రయత్నాన్ని తిప్పికొట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామితోపాటు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## పేదోడికి ఒక న్యాయం.. పెద్దోడికి ఒక న్యాయమా?

(మొదటిపేజీ తరువాయి)

న్యాయం.. పేదవాళ్లకు ఒక న్యాయం' పేరిట హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "హైడ్రా పేరుతో ప్రభుత్వం పాల్పడుతున్న అరాచకాలకు ఎంతోమంది బాధితులుగా మారారు. చాంద్రాయణగుట్టలో పాఠశాల భవనాన్ని కూడా కూలగొట్టారు. కేసీఆర్ హయాంలో ఎక్కడ చూసినా కట్టడాలే కనిపించేవి. హైదరాబాద్‌లోనే లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించాం. వైట్‌హౌస్‌ను తలదన్నేలా సచివాలయం, దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కట్టుకున్నాం. హైదరాబాద్‌లో 42 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాం. ప్రతి జిల్లాలో కలెక్టరేట్లు కట్టాం. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాం. రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కొత్త నిర్మాణం కూడా చేపట్టలేదు. రేవంత్‌రెడ్డి చేసిన పని కూలగొట్టడమే. పేదవాడికి ఒక న్యాయం.. ఉన్నవాడికి ఒక న్యాయం... ఇదే ఈ ప్రభుత్వం పనితీరు. హైడ్రాపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పెద్ద ప్రజంటేషన్ ఇచ్చారు. ఆ రోజు చాలా మంది బిల్డర్ల పేర్లు చెప్పారు. ఏ బిల్డర్‌నూ మేం ఇబ్బంది పెట్టదలుచుకోలేదు. పేదల ఇంటికి వచ్చిన బుల్డోజర్... ఆ బిల్డర్ల జోలికి ఎందుకు వెళ్లలేదో ప్రభుత్వం చెప్పాలి. ఎఫ్‌టీఎల్ పరిధిలో కడితే ఎవర్నీ వదలబోమని చెప్పినా... పెద్దలను వదిలేశారు. చెరువును పూడ్చి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇల్లు కట్టారు. మరో మంత్రి వివేక్ వెంకటస్వామి కూడా హిమాయత్‌సాగర్ చెరువు వద్ద ఇల్లు కట్టుకున్నారు. రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇల్లు నిర్మించుకున్నారు. వీళ్లను ముట్టుకునే ధైర్యం హైడ్రా చేస్తుందా? అందుకే హైడ్రాను మేం వ్యతిరేకిస్తున్నాం" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## బిసి రిజర్వేషన్లపై పోరాటాన్ని పల్లె పల్లెకు విస్తరించాలి

(మొదటిపేజీ తరువాయి)

పార్టీల నేతల రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం బీసీ ఐకాస వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ఈ ఉద్యమంతో బీసీలందరికీ తెలంగాణ దిక్సూచిగా మారనుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో క్రమంగా ఐక్యత పెరుగుతోందన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో, ప్రత్యేక తెలంగాణలో ఇప్పటివరకు బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి కాకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ.. శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టేలా ఎంపీలపై ఒత్తిడి తేవాలని సూచించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. ఉద్యమాలకు దళితుల నుంచి మద్దతు ఉంటుందని, వ్యక్తిగతంగా కాకుండా బీసీ సమాజం కోసం పోరాడినప్పుడే రిజర్వేషన్లు అమలవుతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఐకాసను సమర్థంగా నిర్వహించాలని, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. సమావేశంలో బీసీ ఐకాస కోఛైర్మన్ దాసు సురేశ్, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్, మాజీ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, సినీ దర్శకులు ఆర్.నారాయణమూర్తి, ఎన్.శంకర్, 90 బీసీ కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### కార్యాచరణ..

నవంబరు 6న రాష్ట్రవ్యాప్తంగా ఫులే విగ్రహాల ముందు బీసీల మౌన దీక్ష, 13న సామాజిక న్యాయ సాధనకు పల్లె నుంచి పట్నం వరకు 'బీసీల ధర్మ పోరాట దీక్షలు, 16న రన్ ఫర్ సోషల్ జస్టిస్, పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఎంపీలపై ఒత్తిడి పెంచడానికి 18న ఎంపీలతో బీసీల ములాఖత్, 23న అఖిలపక్ష పార్టీల సమావేశం, డిసెంబరు మొదటివారంలో బీసీల చలో దిల్లీ, పార్లమెంటు ముట్టడి, మూడోవారం నుంచి పల్లె నుంచి పట్నం వరకు బస్సు యాత్ర, జనవరి నాలుగోవారంలో చలో హైదరాబాద్, వేల వృత్తులు–కోట్ల గొంతులు పేరుతో భారీ బహిరంగ సభ.

## మహాలక్ష్మి ఉచిత ప్రయాణాలు 226.41 కోట్లు

**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం 'మహాలక్ష్మి'లో ఉచిత ప్రయాణాల సంఖ్య సెప్టెంబరు నెలాఖరు నాటికి 226.41 కోట్లకు చేరుకుంది. 2023 డిసెంబరు 9 నుంచి ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. మహిళలకు ఉచిత ప్రయాణాల ద్వారా రూ.7,575.52 కోట్ల ప్రయోజనం కలిగింది. ఇప్పటి వరకు ఆర్టీసీకి ప్రభుత్వం 6,222.21 కోట్లు చెల్లించింది. మరో రూ.1,353.31 కోట్లు ఇవ్వాల్సి ఉంది.

## విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

**హైదరాబాద్:** ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లోని విద్యార్థులకు సమగ్ర శిక్షా, టీశాట్ సంయుక్తంగా ఈ నెల 13 వరకు ఉపన్యాస, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్య సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. బాలవక్త ఉపన్యాస, వ్యాస రచన పోటీలు తెలుగు, ఆంగ్ల భాషల్లో నిర్వహిస్తామని, జనరల్ నాలెడ్జ్, అకడమిక్స్, కరెంట్ ఎఫైర్స్ అంశాలపై క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. ఈ నెల 4 వరకు మండల స్థాయిలో, 5–8 వరకు జిల్లా స్థాయిలో, 9–10 తేదీల్లో జోనల్ స్థాయిలో ఉంటాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు టీశాట్ ఆవరణలో 12–13 తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## నేటి నుంచి ఇంజినీరింగ్ కళాశాలల బంద్

**హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, బీఈడీ తదితర వృత్తి విద్యా కళాశాలలు, డిగ్రీ కళాశాలలు సోమవారం నుంచి నిరవధిక బంద్‌ను పాటించనున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయనందుకు గాను నిరసనగా సోమవారం నుంచి నిరవధిక బంద్‌కు ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పలు కళాశాలల యాజమాన్యాలు ఆదివారం మధ్యాహ్నం నుంచే విద్యార్థులకు బంద్ నేపథ్యంలో కళాశాలలు పనిచేయవని సంక్షిప్త సందేశాలు పంపాయి. బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఏఐఎస్ఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. తమ బంద్‌కు సహకరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులను సమాఖ్య నేతలు కోరారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా 75 పీజీ సీట్లు

- తాజాగా కేటాయించిన నేషనల్ మెడికల్ కౌన్సిల్
- 1,547కు పెరగనున్న ప్రభుత్వ పీజీ వైద్య సీట్ల సంఖ్య

**హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా 75 పీజీ సీట్లను కేటాయిస్తూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) నిర్ణయం తీసుకుంది. ఉస్మానియా వైద్య కళాశాలతో పాటు మరో ఆరు ప్రభుత్వ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో కొత్త సీట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా కాలేజీలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో 4 సీట్లు మంజూరు చేసిన ఎన్ఎంసీ.. నిజామాబా ద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 8 సీట్లు, మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నాలుగు పీజీ సీట్లను మంజూరు చేసింది. కొత్తగా ఏర్పాటైన సిద్దిపేట, సూర్యాపేట, నల్లగొండ, రామగుండం వైద్య కళాశాలల్లో పెద్ద ఎత్తున పీజీ సీట్లు కేటాయించడం విశేషం. పెరిగిన సీట్లకు ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు జరగనున్నాయి. 75 సీట్లు పెరగడంతో రాష్ట్రంలో స్పెషాలిటీ డాక్టర్ల సంఖ్య పెరిగి మరింత నాణ్యమైన వైద్య సేవలు అందనున్నాయని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 2,983 పీజీ వైద్య సీట్లు అందుబాటులో ఉన్నాయి. అందులో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 1,472 పీజీ సీట్లు ఉండగా వాటికి 75 సీట్లు అదనంగా కలవనున్నాయి. దీంతో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పీజీ సీట్ల సంఖ్య 1,547కు పెరగనుంది. వాటిలో 50 శాతం అఖిల భారత కోటా కింద పోగా మిగతా 50 శా తం అంటే 773 సీట్లు తెలంగాణ స్థానిక విద్యార్థులకే లభించనున్నాయి.



## జక్కేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** కూసుమంచి మండలంలోని జక్కేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి గంగాధర్ ఆదివారం ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని తెలిపారు. ఆరుగాలం కష్టపడి పని చేసి పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో జక్కేపల్లి సొసైటీ అధ్యక్షులు నలబోలు చంద్రారెడ్డి,పాలకవర్గ సభ్యులు,అసిస్టెంట్ రిజిస్ట్రార్ దశరథ రామ్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్, గ్రామ నాయకులు పెదవీటి శ్రీనివాస్ రెడ్డి,రామిని అనంత రామిరెడ్డి రెడ్డి, కొత్త నరేందర్ రెడ్డి,కొరివి వెంకటరత్నం,యాస విష్ణువర్ధన్ రెడ్డి, కొత్త ముకుంద రెడ్డి,కొత్త అనంత రెడ్డి,కొత్త కృష్ణారెడ్డి, కొత్త సత్యనారాయణ రెడ్డి,కళ్లెం అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆయుష్ శాఖలో వి.టి దాస్ సేవలు అభినందనీయం

- టిజిఓ జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి
- ఘనంగా పదవి విరమణ సన్మాన కార్యక్రమం

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ప్రభుత్వ ఆయుష్ శాఖలో సుదీర్ఘంగా 37 ఏళ్లపాటు మచ్చలేకుండా ఫార్మసిస్ట్ గా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన వట్టికూటి తిరుపతి దాస్(వి.టి దాస్) సేవలు అభినందనీయం అని ఖమ్మం జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం(టిజిఓ) ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి అన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి ఆయుష్ వైద్యశాల ఫార్మసిస్ట్ వి.టి దాస్ పదవి విరమణ సన్మాన కార్యక్రమం ఆదివారం ఖమ్మం నగరంలోని వివిసి ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా పని చేసిన ప్రతి చోట తోటి సహోద్యోగులు,అధికారులు,ప్రజలతో మమేకమై ఉద్యోగ బాధ్యతలను నీతి నిజాయితీతో పాటు,ఓపిక సహనంతో వైద్య సేవలు అందించి,ఉత్తమ ఉద్యోగిగా గౌరవ మర్యాదలు పొందటం గర్వకారణం అని చెప్పారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని,దాస్ శేష జీవితమంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ప్రజలకి వైద్య సేవలు అందిస్తూ గడిచిపోవాలన్నారు. అనంతరం వి.టి దాస్ నర్సుబాయి దంపతులను శాలువా కప్పి,గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిజిఓ నాయకులు డాక్టర్ పగిడికత్తుల విజయ్ కుమార్,గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు కత్తి నెహ్రూ, బిఆర్ఎస్ నాయకులు జక్కుల యాదగిరి, అనపర్తి కొండలు,పాల వెంకన్న,గుజ్జ రామకృష్ణ,రమేష్,పలువురు ఉద్యోగ,ఉపాధ్యాయ నాయకులు,గ్రామస్తులు,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు




## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు

- మణుగూరులో దాడి ఖండించిన అశ్వారావుపేట నాయకులు
- కాంగ్రెస్ పాలనలో రౌడీయిజం పెరిగిందని ఆరోపణ

**అశ్వారావుపేట, నవంబర్ 02:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఖండించేందుకు బయలుదేరిన అశ్వారావుపేట మండల బిఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకుని ముందస్తుగా అరెస్టు చేయడం పెద్ద దుమారానికి దారితీసింది. అరెస్టు చేసిన నాయకులను అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ చర్యను మండల నాయకులు తీవ్రంగా ఖండిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రౌడీయిజం విపరీతంగా పెరిగిందని, ప్రజాస్వామ్యం కుంగిపోతుందని విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని, ఆయన ధైర్యాన్ని భయపడి కాంగ్రెస్ నేతలు ప్రణాళికాబద్ధంగా మణుగూరు పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చూడాలని వారు అధికారులను కోరారు. అరెస్టయిన వారిలో మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, యు.ఎస్. ప్రకాశ్‌రావు, సత్యవరపు సంపూర్ణ, దగ్గుమల్ల నరేంద్ర, నక్కా రాంబాబు, తాళం సూరి, ఆరేపల్లి గోవింద్, నందికోల వెంకన్న, సోమని రమేష్, అనుమాస చరణ్, బోనసీ కార్తీక్ తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి దారుణం..

- కాంగ్రెస్ గుండాల దౌర్జన్యంపై మెచ్చా ఆగ్రహం
- జిల్లా శాంతిని భగ్నం చేసే కుట్ర
- తక్షణ చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్



**అశ్వారావుపేట, నవంబర్ 02 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి మెచ్చా నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగ కాంతారావు ప్రజల సమస్యలపై గళమెత్తి పోరాడుతుంటే తట్టుకోలేక కాంగ్రెస్ కార్యకర్తలు గుండాచర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ప్రశాంతంగా ఉన్న జిల్లాను కలవరపెట్టడమే కాంగ్రెస్ నాయకుల లక్ష్యమని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో గత పదేళ్లలో ఎన్నడూ చూడని పరిస్థితులు ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో చోటుచేసుకుంటున్నాయని, కేవలం రెండేళ్లలోనే రాష్ట్రం మొత్తం రౌడీ రాజ్యంగా మారిపోయిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు సైతం భయంతో జీవించే పరిస్థితి నెలకొన్నదని, ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ అని ఆయన పేర్కొన్నారు. దాడి సమయంలో బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడ ఉంటే ప్రాణహాని తప్పేది కాదని, ఇది ఉద్దేశపూర్వక దాడి అని ఆయన అన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా కల్లోలం రేపే అవకాశముందని ఆయన హెచ్చరించారు. దాడిలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలను వెంటనే అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, పోలీసులు నిద్రలేవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా ఆగ్రహం భీకరంగా ఉప్పొంగి తీవ్ర పరిణామాలు చోటుచేసుకుంటాయని హెచ్చరించారు. మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై పోరాడేవారిపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని, రాజకీయ విభేదాలు గుండాచర్యలుగా మారితే రాష్ట్రానికి ప్రమాదమని స్పష్టం చేశారు. ప్రజల ప్రశాంత జీవనాన్ని కాపాడే బాధ్యత అధికారులదే అని ఆయన అన్నారు.

## భూమి దోపిడీ

- ఇల్లు పేరుతో మట్టిని విక్రయించి వేలు వసూలు చేస్తున్నారు
- అధికారులు తెలియనట్టే వ్యవహారం
- గిరిజనుల ఆవేదన - న్యాయం ఎక్కడ?



**అశ్వారావుపేట, నవంబర్ 02 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల పరిధిలోని అనేక గిరిజన గ్రామాలు ఇప్పుడు భూమి దోపిడీ బారిన పడుతున్నాయి. పల్లెల్లో, తండాల్లో మట్టిని కోయడం, అమ్మడం అనే దందా రోజురోజుకీ ఉధృతమవుతోంది. ప్రజల నిత్యావసరాల కోసం, వ్యవసాయ పనుల కోసం ఉండాల్సిన మట్టిని కొందరు అధికార పార్టీ అండదండలతో కోయించి అమ్ముకుంటూ వేలు రూపాయలు సంపాదిస్తున్నారు. ప్రత్యేకంగా "ఇందిరమ్మ గృహం" పేరిట అనేక చోట్ల మట్టిని పెద్ద ఎత్తున తవ్వి విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రజల భూముల్లోని మట్టిని ప్రభుత్వ పనుల పేరిట తీసుకెళ్లి, వ్యక్తిగత లాభాల కోసం అమ్మేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అడిగితే దాడులకు దిగిపోతున్నారు. ఎవరైనా అడ్డుకోవాలంటే, "మాకు పర్మిషన్ ఉంది" అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఇదంతా అధికారుల కంటపడక పోవడం ఆశ్చర్యమే. కొన్నిసార్లు అధికారులు ప్రత్యక్షంగా చూసినా చర్యలు తీసుకోవడం లేదు. గ్రామస్థులు చెబుతున్నారు. "ఎవరైనా ఫిర్యాదు చేసినా ఫలితం ఉండదు. మట్టి దందా కడకు వెళ్లిపోతోంది. అధికారులు చూడనట్లు ప్రవర్తిస్తున్నారు" అని. ఈ నిర్లక్ష్యంతో గిరిజనుల జీవనాధారం పూర్తిగా దెబ్బతింటోంది. మట్టి తీసివేతతో పొలాలు పాడైపోతున్నాయి. పంటల దిగుబడి తగ్గిపోతోంది. నీటి నిల్వలు ఆరిపోతున్నాయి. పల్లెల పర్యావరణ సమతుల్యత కూలిపోతోంది. ఒకప్పుడు పచ్చగా ఉన్న భూములు ఇప్పుడు గోతులుగా మారిపోయాయి. ఈ దోపిడీ వల్ల గిరిజన కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా కుంగిపోతున్నాయి. మహిళలు, పిల్లలు భయంతో బయటకు రావడానికి కూడా వెనుకాడుతున్నారు. "మట్టిని అమ్ముకోవడం ఒకరి లాభం కావొచ్చు కానీ పల్లెల జీవితం నాశనం అవుతోంది" అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల డిమాండ్ స్పష్టం ం ఈ దందాను అడ్డుకునేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. మట్టిని అక్రమంగా అమ్ముకునే వారిపై కేసులు నమోదు చేయాలి. బాధ్యులైన అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి. గ్రామస్థాయిలో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసి భూమి, మట్టిపై లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించాలి. ప్రజల ప్రశ్న ఒకటే ం భూమి అమ్మకమేనా, మన పల్లెలు అమ్మబోతున్నాయా? గిరిజనుల హక్కులు కాపాడే రోజు ఎప్పుడు వస్తుందో తెలియదు. కానీ ఒక్క న్యాయం కావాలి ం ఈ దోపిడీ ఆగాలి.

## సమాన విద్య కోసం పిడియస్‌యూ పిలుపు

- నవంబర్ 4న సత్తుపల్లిలో జిల్లా మహాసభలు
- ప్రభుత్వ విద్యా వైఫల్యాలపై ఆగ్రహం వెల్లువ
- విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాస్వామిక వాదులు పాల్గొనాలని పిలుపు



**ఖమ్మం, నవంబర్ 02:** ప్రగతిశీల విద్యార్థి ఉద్యమ చరిత్రలో మరో మైలురాయి కానున్న పి.డి.యస్.యూ ఖమ్మం జిల్లా 23వ మహాసభలను నవంబర్ 4న సత్తుపల్లిలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు తిప్పరపు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ తెలిపారు. స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడ్డాక విద్యా వ్యవస్థలో మార్పులు వస్తాయని ప్రజలు ఆశించినా, బీఆర్ఎస్ పాలనలోనూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ విద్యా రంగం మరింత దెబ్బతిందని వారు విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లలో నిర్లక్ష్యం కారణంగా పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్రీయ ప్రజా విద్య పరిరక్షణ, ఉద్యోగ%–%ఉపాధి అవకాశాల సాధనకై పి.డి.యస్.యూ నిరంతర పోరాటాలు చేస్తోందని పేర్కొన్నారు. 1960లలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పుట్టిన పి.డి.యస్.యూ, జార్జ్ రెడ్డి స్ఫూర్తితో విద్యార్థి ఉద్యమానికి మార్గదర్శకంగా నిలుస్తోందని తెలిపారు. మహాసభలను విజయవంతం చేసి సమాన విద్య, సమాన సమాజ స్థాపన లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు అశోక్, వెంకటేష్ శ్రీను, స్టాలిన్, నరేందర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.




## పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలి

- ఉపాధ్యాయుల హక్కులపై టీఎస్ యుటిఎఫ్ ధ్వజం ఎగరేసింది
- టెట్, డి ఏలు, బకాయిల విడుదలపై ప్రభుత్వం స్పందించాలి
- వేంసూరు మండలంలో ఉపాధ్యాయుల ఐక్యతకు ప్రతీకగా మహాసభ

**సత్తుపల్లి, నవంబర్ 02 :** వేంసూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన టీఎస్ యుటిఎఫ్ 12వ మండల మహాసభలో ప్రభుత్వం పి ఆర్ సి నివేదికను వెంటనే అమలు చేయాలని, టెట్ సమస్యను పరిష్కరించాలని ప్రధాన వక్త సురేష్ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డి ఏలను విడుదల చేసి ఉపాధ్యాయులను ప్రభుత్వం ఆదుకోవాలని పిలుపునిచ్చారు. మరో వక్త నిర్మల కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా పరిరక్షణకు టీఎస్ యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని, కుటుంబ సంక్షేమ నిధి ద్వారా ఇప్పటివరకు 50 కుటుంబాలకు 3కోట్ల రూపాయల సాయం అందించడం సంఘ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. సీనియర్ కార్యకర్త సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంచడంలో యుటిఎఫ్ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు, గ్రూప్–1లో ఎంపీడీవోగా ఎంపికైన కోలేటి పుల్లారావుకు సన్మానం చేశారు. మండల మహాసభలో వేంసూరు మండల ఉపాధ్యాయులతో పాటు పరిసర ప్రాంతాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కిషోరి, లక్ష్మయ్య, భారతి, శిరీష, షకీలా బేగం, రాంబాబు, నగేష్, రాధాకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.



## దుమ్ముతో అశ్వారావుపేట ఉక్కిరిబిక్కిరి

### జనసేన ముందడుగు

- రహదారి విస్తరణ పనుల్లో జాప్యం
- కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందులు
- జనసేన ట్యాంకర్ ద్వారా నీరు చల్లిన చర్య ప్రశంసనీయం

**అశ్వారావుపేట, నవంబర్ 02:** అశ్వారావుపేట పట్టణంలో అభివృద్ధి పనుల పేరుతో నెలలుగా సాగుతున్న రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు ప్రజలకు ఊపిరాడనివిధంగా మారాయి. పనులు పూర్తి కాకపోవడంతో పట్టణం మొత్తం దుమ్ము దూళితో కమ్ముకుంది. ప్రధాన రహదారులపై రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల దుమ్ము మేఘాల మధ్య ప్రజలు ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. సమయానికి రోడ్డు పనులు పూర్తవకపోవడం, వాటర్ రింగ్ సరైన విధంగా చేయకపోవడంతో కాలుష్యం రోజు రోజుకీ పెరుగుతోంది. అధికారులు మొక్కుబడిగా ఎక్కడో ఒకచోట మాత్రమే నీరు చల్లడం జరుగుతుండటంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. పిల్లల నుండి వృద్ధుల వరకు శ్వాసకోశ సమస్యలు, కళ్ల దురద, దగ్గు వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యను గుర్తించిన జనసేన పార్టీ ముందడుగు వేసింది. అశ్వారావుపేట జనసేన నాయకులు స్వచ్ఛందంగా ట్యాంకర్ సాయంతో ప్రధాన రహదారులపై నీరు చల్లి దుమ్ము తగ్గించే ప్రయత్నం చేశారు. ఇది పూర్తిస్థాయి పరిష్కారం కాకపోయినా ప్రజలకు తాత్కాలిక ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని జనసేన నాయకులు తెలిపారు. "ప్రజల కోసం చిన్న సహాయం చేయగలిగితే అదే మా సంతృప్తి" అని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు ఈ సమస్యపై శ్రద్ధ చూపి శాశ్వత పరిష్కారం చూపాలని, రహదారి పనులను వేగవంతం చేయాలని జనసేన డిమాండ్ చేసింది. జనసేన నాయకులు మాట్లాడుతూ "జై జనసేన, జై తెలంగాణ, జై హింద్" అంటూ ప్రజల మద్దతుతో అభివృద్ధి కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

## దాడిని ఖండించిన సున్నం నాగమణి

- మణుగూరు బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి తీవ్ర ఖండన
- రేగ కాంతారావుపై కుట్రగా కాంగ్రెస్ చర్య
- బాధ్యులపై వెంటనే చర్యల డిమాండ్



**అశ్వారావుపేట, నవంబర్ 02 :** మణుగూరు మండలంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ములకలపల్లి మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి తీవ్రంగా ఖండించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగ కాంతారావు ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తుండటంతో తట్టుకోలేక కాంగ్రెస్ గుండాలు కార్యాలయంపై దాడి చేశాయని తెలిపారు. రాష్ట్రంలో అరాచక పరిపాలన నడుస్తోందని, ఇటువంటి దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చ అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని సున్నం నాగమణి హెచ్చరించారు.



## కుక్కల బారిన పల్లెలు

- ప్రాణాలపై ముప్పు, ప్రభుత్వాల నిర్లక్ష్యం
- రక్షణ చట్టాలే కుక్కలకు వరమై, మనుషులకే శాపమయ్యాయి
- పల్లెలు, తండాలలో భయాందోళనలు - సాయంత్రం తర్వాత బయటకు రావాలంటే భయం
- ప్రభుత్వం, అధికారులు నిద్రలో -లప్రాణాలను కాపాడమని ప్రజల పిలుపు

**అశ్వారావుపేట,నవంబర్ 02:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట మండలంలో కుక్కల బారి రోజురోజుకీ తీవ్రరూపం దాల్చుతోంది. గిరిజన గ్రామాలు, తండాలు, పల్లెలలో విపరీతంగా పెరిగిపోతున్న వీధికుక్కలు ప్రజల ప్రాణాలకు శాపంగా మారాయి. చిన్న పిల్లలతో బయటకు రావాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. మేకలు, గొర్రెలు, కోళ్లు మాత్రమే కాదు – మనుషులమీదకే గుంపులుగా దాడి చేస్తున్న కుక్కలు ప్రజల జీవితాలను భయంకరంగా మార్చేశాయి. జంతు రక్షణ చట్టాలు జంతువులకు రక్షణగా మారగా, మనిషికి మాత్రం రక్షణ లేకుండా పోయింది. ప్రతి గ్రామంలో, ప్రతి తండాలో గుంపులుగా తిరిగే కుక్కలు రాత్రివేళల్లో దాడులు చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నాయి. కుక్కల కాట్లతో గాయపడిన చిన్న పిల్లలు, వృద్ధులు చికిత్స కోసం దవాఖానల్లో చేరాల్సి వస్తోంది. స్థానికులు చెబుతున్నారు – "ఎవరైనా సాయంత్రం బయటకు వస్తే ప్రాణాలు కాపాడుకోవడం కష్టంగా మారింది. గ్రామపంచాయతీ అధికారులు చూడటమే గాని చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వాలు కూడా ఈ ముప్పును పట్టించుకోవడం లేదు" అని. అధికారులు అయితే ఎటూ చూడనట్టే వ్యవహరిస్తున్నారు. కుక్కలను నియంత్రించాల్సిన వారు కూడా నిమ్మకు నీరెత్తినట్లు నిశ్చలంగా ఉన్నారు. కొన్నిచోట్ల చిన్న పిల్లలపై దాడులు జరిగినప్పటికీ, కుక్కలను పట్టుకోవడం, నివారణ చర్యలు చేపట్టడం వంటి చర్యలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే దృశ్యం కనిపిస్తోంది. పట్టణాల్లోనూ, పల్లెల్లోనూ కుక్కల దాడులు పెరుగుతూనే ఉన్నాయి. ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు – "కుక్కల బారి నుండి మానవ ప్రాణాలను కాపాడండి, కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టండి" అని. రేవంత్ ప్రభుత్వం ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని, గిరిజన తండాలు, పల్లెలలో ప్రాణాలను కాపాడే విధంగా పెద్ద ఎత్తున కుక్కల నియంత్రణ కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# రెండు అరచేతులు కాసేపు రుద్దితే



అప్పుడప్పుడు చాలా మంది రెండు అరచేతులు రుద్దుతుంటారు. రెండు చేతుల అరచేతులను రుద్దడం ముద్రా దోషమని చాలామంది నమ్ముతారు. అలాగే చాలా మందికి తరచుగా చెమటతో చేతులు తడిసిపోతుంటాయి.ముఖ్యంగా చలికాలంలో ఈ సమస్య ఎక్కువగా సంభవిస్తుంది. ఇలాంటప్పుడు కూడా చేతులు మళ్లీ మళ్లీ రుద్దుంటారు. చాలా మంది ఎగ్జామ్ హాల్‌లో కూర్చున్నప్పుడు లేదా ఇంటర్వ్యూ ఇస్తున్నప్పుడు టేబుల్ కింద పదేపదే చేతులు రుద్దుతుంటారు. పరీక్షలు లేదా ఇంటర్వ్యూల ఒత్తిడి నుంచి బయటపడటానికి ఇలా చేస్తే ప్రయోజనం ఉంటుంది. భయం, మానసిక ఆందోళన, చంచలత్వం సంభవించినప్పుడు కూడా దీన్ని చేయవచ్చు.ఈ విధానం మనస్సుకు సానుకూల శక్తిని ప్రసారం చేయడానికి ఉద్దీపనగా పనిచేస్తుంది. ఈ ముద్ర మానసిక స్థితిని నిర్వహించడానికి, మనస్సును శాంతపరచడానికి కూడా సహాయపడుతుంది. రెండు చేతుల అరచేతులను రుద్దడం వల్ల కలిగే ప్రయోజనాలు చాలానే ఉన్నాయి. రెండు చేతుల అరచేతులను రుద్దడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. అప్పుడు శక్తి ప్రసారం అవుతుంది. మంచి మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇది సహాయపడుతుంది. మీరు ఎప్పుడ్కైనా ఏకాగ్రత లోపిస్తే లేదా అనిశ్చితితో బాధపడుతుంటే, ఈ విధానాన్ని ఉపయోగించవచ్చు. చేతులు రుద్దడం కూడా నాడీ ఉద్రిక్తతను అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది. మీరు ఏద్కైనా విషయం గురించి ఆందోళన చెందుతుంటే రెండు చేతుల అరచేతులను రుద్దడం ద్వారా మీరు దీనిని అధిగమించవచ్చు. ఈ ట్రిక్ శారీరక అలసటను కూడా అదుపులో ఉంచుతుంది. ఆనందం, విచారం, నిరాశ, వీటిలో ఏదీ అతిగా ఉండటం మంచిది కాదు. దాంతో మనసుపై ఒత్తిడి పెరుగుతుంది. శారీరక, భావోద్వేగ బాధల నుంచి ఉపశమనం కలిగించి, భావోద్వేగాలను నియంత్రణలో ఉంటాయి.మనస్సు చంచలంగా ఉంటే లేదా నాడీ ఉద్రిక్తతను నియంత్రించలేకపోతే నిద్ర రాదు. కాబట్టి మీరు రాత్రి నిద్రపోయే ముందు రెండు చేతుల అరచేతులను రుద్దడానికి ప్రయత్నించవచ్చు. శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో సహాయపడుతుంది.

# తరచూవాడే వస్తువులతో క్యాన్సర్ వస్తుందా?



మనం ఎన్నో వస్తువులను సైతం ఉపయోగిస్తూ ఉంటాము.. అయితే ఇందులో చాలా ప్రమాదకరమైన వస్తువులను మనం ఉపయోగించడం వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంటుందట.ముఖ్యంగా మనం ఇంట్లో ఉపయోగించేటువంటి వస్తువుల వల్ల పలు రకాల ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తూ ఉంటుంది. ముఖ్యంగా క్యాన్సర్ కారక ఉత్పత్తులను చాలామంది ఇళ్లల్లో ఉపయోగిస్తూ ఉన్నారట. ఇటీవలే కొంతమంది నిపుణులు పలు రకాల పరిశోధనలు చేసి ఇందులో కొన్ని ప్రమాదకరమైన క్యాన్సర్ కారకాలను కలిగి ఉన్న వస్తువులను గురించి కొన్ని తెలియజేశారు. ముఖ్యంగా క్లీనింగ్ ప్రొడక్షన్ నుంచి మనం ప్రతిరోజు ఉపయోగించే షాంపుల వరకు చాలా వాటిలో క్యాన్సర్ కు కారణమయ్యే పలు రకాల అంశాలు ఉన్నాయట.. మరి కొన్ని వాటిలో రసాయనాలను కలిపిన వాటిని మనం ప్రతిరోజు ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా చాలా షాంపులలో కండిషనర్లలో చాలా ప్రమాదకరమైన సోడియం లారీలు సల్ఫేట్ ఉపయోగిస్తున్నారట.. ఇది చాలా సువాసనమైనది. అలాగే సింథటిక్ రంగులను ఉపయోగించి పలు రకాల వాటిని తయారు చేస్తున్నారట. అలాగే పారాబెన్లు రసాయక కారకాలు క్యాన్సర్ వంటి కలిగించేలా చేస్తాయట. 99 శాతం బ్రెస్ట్ క్యాన్సర్ వాటిని ఇవి ఎక్కువగా కలిగిస్తున్నాయని నిపుణులు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా కలర్ కెమికల్స్ లో సింథటిక్ వంటి పదార్థాన్ని ఉపయోగించడం వల్ల పుట్టే పిల్లలలోనే కూడా నరాల బలహీనత లోపాలు క్యాన్సర్ తో పుడుతున్నట్లుగా పలు రకాల సర్వేలు తేల్చి చెప్పాయి. అలాగే పెర్ఫ్యూమ్ లు కూడా చాలా వాటిలో విషపూరితమైన పదార్థాలు ఉన్నట్లుగా గుర్తించారు. అలాగే నాన్ స్టిక్ పాత్రలలో కూడా థావా మరియు కుక్కర్లను ఉపయోగిస్తూ ఉంటాము.. ఇలాంటి వాటిలో మనం ఏద్కైనా ఉడికించడం లేదా వంట చేయడం వంటివి చేయడం వల్ల ఇందులో చాలా హానికరమైన అంశాలు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో సింథటిక్ పూతను పూయడం జరుగుతుంది. ఇందులో టెల్ఫాన్ అనే రసాయం కూడా ఉంటుందట. ప్లాస్టిక్ ని 450 డిగ్రీల కంటే ఎక్కువ వేడి చేసినప్పుడు ఇది ఒక రసాయనం గా మారుతుందట.

చాలా మందికి అల్పాహారంగా ఓట్స్ లేదా కార్న్‌ఫ్లేక్స్ తినడం అలవాటు. కాబట్టి వీరికి తప్పనిసరిగా పాలు అవసరం. ఇంట్లో పిల్లలు ఉంటే ప్రతిరోజూ ఒక గ్లాసు పాలు తప్పకుండా ఇవ్వాలి. అలాగే చాలా మందికి రాత్రి పడుకునే ముందు గ్లాసు పాలు తాగే అలవాటు ఉంటుంది. కొందరైతే కొద్దిగా పసుపు కలిపి పాలు తాగుతుంటారు. రోజూ పాలు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు తక్కువేమీ కాదు. శరీరంలో కాల్షియం లోపాన్ని పూరించడానికి పాలు సహాయపడుతుంది. పాలలో కాల్షియం, ఫాస్పరస్, పొటాషియం, విటమిన్ డి వంటి వివిధ క్రియాశీల పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. నిత్యం పాలు తాగడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. రోగాలు త్వరగా నయం కావాలంటే పాలు తాగడం మంచిది. పాలలో ఉండే అనేక ప్రయోజనకరమైన పదార్థాలు దంతాలు, ఎముకల సంరక్షణలో సహాయపడతాయి. చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే పాలు కూడా చాలా ముఖ్యం. అయితే చాలా మంది ప్యాకెట్ పాలు వాడుతుంటారు. మార్కెట్ నుండి కొనుగోలు చేసిన ప్యాకేజ్డ్ పాలు ఆరోగ్యానికి సురక్షితమేనా? ప్యాకెట్ పాలను నేరుగా పచ్చిగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదేనా? లేదా కాచినవే తీసుకోవాలా? గతంలో ఆవులు, గేదెల నుంచి సేకరించిన పాలను వినియోగించేవారు. ప్రస్తుతం అందరూ 'టెట్రా ప్యాక్' లేదా ప్యాకెట్ పాలను వాడుతున్నారు. అన్ని చోట్లా ఈ పాలను వినియోగించే ట్రెండ్ కూడా పెరిగింది. కానీ ప్యాకెట్ పాలు పాశ్చరైజ్డ్ చేసి ఉంటాయి. పాలను స్టెరిలైజ్ చేసి నిల్వ చేసే ప్రక్రియను పాశ్చరైజేషన్ అంటారు. పాలను 72 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద 15 సెకన్ల పాటు ఉడకబెట్టడం ద్వారా ప్రత్యేక పద్ధతిలో ఎక్కువ కాలం నిల్వ చేయడానికి పాశ్చరైజ్ చేస్తారు. మార్కెట్‌లో స్టెరిలైజ్ చేసి ప్యాక్ చేసిన పాశ్చరైజ్డ్ పాలను కాగబెట్టకుండా పయోగించవచ్చని చాలా మంది అనుకుంటారు. కానీ స్టెరిలైట్ చేసినా మరిగించకుండా పాలను నేరుగా తీసుకోవడం సరికాదని వైద్యులు చెబుతున్నారు. ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఎక్కువట. కాబట్టి పాశ్చరైజేషన్ పాలను తప్పనిసరిగా కాగబెట్టి వినియోగించాలి.

# ప్యాకెట్ పాలను పచ్చిగా తాగాలా?



# ఒత్తిడిని పెంచే ఆహారాలు..!



చాలామంది ఎక్కువ స్ట్రెస్ కు గురవుతూ ఉంటారు. బయట ఫుడ్ తినటం వల్ల ఎక్కువ స్ట్రెస్ కి గురయ్యే అవకాశం ఉంటుంది. ఎందుకంటే బయట ఫుడ్ ఆరోగ్యానికి అంత మంచిది కాదు.ఆహారాలలో ఆరోగ్యానికి మేలు చేసే గుణమే కాదు,అధికంగా తీసుకుంటే అనారోగ్యాలకు, మానసిక ఒత్తిడికి గురి చేసే లక్షణం కూడా కొన్నింటిలో ఉంటుంది. కాబట్టి తరచుగా స్ట్రెస్ రిలేటెడ్ ఇష్యూస్ ఉన్నవారు కొన్ని రకాల ఫుడ్స్ కు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో చూద్దాం. ఒత్తిడి అంటే ఫిజికల్ గా .. మెంటల్ గా ఆందోళనకు గురికావడం.సాధారణంగా ప్రతికూల ఆలోచన, బాధాకరమైన సంఘటన వంటివి ఇందుకు కారణం అవుతుంటాయని అందరికీ తెలిసిందే. అయితే కొన్ని రకాల ఆహారాలు కూడా ఒత్తిడికి గురిచేస్తాయని నిపుణులు అంటున్నారు. ఆ సందర్భంలో నిరాశ, నిస్పృహ, కోపం, ఆత్రుత వంటి భావాలు అధికం అవుతాయి. ఒత్తిడి స్థాయిని బట్టి తలనొప్పి, నిద్రలేమి వంటి సమస్యలు కూడా వస్తుంటాయి. డ్రెస్ రిలేటెడ్ ఆహారాలు, పానీయాల విషయానికి వస్తే మద్యం, జంక్ ఫుడ్స్, స్వీటెనర్లు, టి, కాఫీ వంటివి ప్రధానం గా ఉంటున్నాయి. మద్యం లేదా ఆల్కహాల్ అధికంగా సేవించే వారిలో సహజంగానే ఒత్తిడి, చికాకు వంటివి కనిపిస్తాయి. ఇక ఫాస్ట్ లేదా జంక్ ఫుడ్స్ కూడా వాటిలోని పదార్థాలు, రసాయనాలు రక్తనాళాలపై ప్రతికూల ప్రభావం చూపడంతో ఆందోళన, ఒత్తిడి వంటి భావాలకు దారితీస్తాయి. కృత్రిమచక్కెరలు లేదా స్వీటెనర్స్ ఎక్కువగా తీసుకోవటం రక్తపోటును, మధుమేహాన్ని మరింత పెంచుతాయి. దీంతో ఒత్తిడి మరింత పెరుగుతుంది. కాఫీ 2 3 కప్పులు తాగితే మేలు చేస్తుంది. అంతకంటే ఎక్కువ తీసుకుంటే మాత్రం అందులోని కెఫీన్ నిద్రలేమి, ఒత్తిడి, ఆందోళన వండి సమస్యలకు కారణం అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. కాబట్టి ఎక్కువగా స్ట్రెస్ కి గురైనప్పుడు కాఫీ చాలా తక్కువగా తాగటం మంచిది.

# ఆస్ట్రేలియాతో మూడో టీ20లో
# టీమ్ఇండియా ఘన విజయం

## రాణించిన వాషింగ్టన్ సుందర్

ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టీ20లో టీమ్ఇండియా 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని టీమ్ఇండియా 18.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో వాషింగ్టన్ సుందర్ (49, 23 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. తిలక్ వర్మ (29, 26 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), అభిషేక్ శర్మ (25, 16 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు), సూర్యకుమార్ యాదవ్ (24, 11 బంతుల్లో 1 ఫోర్,





2 సిక్సులు) చెప్పుకోదగ్గ పరుగులు చేశారు. ఈ విజయంతో అయిదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-1తో సమం చేసింది. టీమ్ ఇండియా తన బ్యాటింగ్‌ను దూకుడుగా ప్రారంభించింది. ముఖ్యంగా అభిషేక్ శర్మ మొదటి రెండు ఓవర్లలో రెండు సిక్సులు, రెండు ఫోర్లతో విరుచుకుపడ్డాడు. అయితే దురదృష్టవశాత్తు అభిషేక్.. నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో (3.3) వికెట్ కీపర్ ఇంగ్లిస్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత కాసేపటికే శుభ్‌మన్ గిల్ (15) ఎల్లిస్ బౌలింగ్‌లోనే (5.3) ఎల్‌బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. రెండో మ్యాచ్‌లో విఫలమైన గిల్.. మూడో మ్యాచ్‌లోనూ పెద్దగా పరుగులు చేయలేకపోయాడు. మంచి టచ్‌లో కనిపించిన సూర్యకుమార్ యాదవ్ స్టాయినిస్ బౌలింగ్‌లో (7.3) నాథన్ ఎల్లిస్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తనకు లభించిన ఆరంభాన్ని తిలక్ వర్మ పెద్ద స్కోర్‌గా మలచలేకపోయాడు. జేవియర్ బార్ట్‌లెట్ బౌలింగ్‌లో జోష్ ఇంగ్లిస్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అక్షర్ పటేల్ (17) సైతం తక్కువ స్కోర్‌కే వెనుదిరిగాడు. త్రుటిలో హాఫ్‌సెంచరీని మిస్‌చేసుకున్న వాషింగ్టన్ సుందర్ చివరి వరకు క్రీజులో పాతుకుపోయి, టీమ్ఇండియాకు విజయాన్ని అందించాడు. జితేశ్ శర్మ (22) టీమ్ఇండియా విజయంలో తన వంతు పాత్రపోషించాడు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఎల్లిస్ 3, జేవియర్ బార్ట్‌లెట్, మార్కస్ స్టాయినిస్ తలో వికెట్ తీసుకున్నారు. ఆసీస్ బ్యాటింగ్ విషయానికొస్తే.. టాప్-3 బ్యాటర్లు ట్రావిస్ హెడ్ (6), మిచెల్ మార్ష్ (11), జోష్ ఇంగ్లిస్ (1) త్వరగా పెవిలియన్ చేరగా.. టిమ్ డేవిడ్ (74, 38 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సులు), మార్కస్ స్టాయినిస్ (64, 39 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సులు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. మాథ్యూ షార్ట్ (26) పరుగులు చేశాడు. భారత్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3 వికెట్లు పడగొట్టగా.. వరుణ్ చక్రవర్తి 2, శివమ్ దూబె ఒక వికెట్ తీశారు.

## తొలి రౌండ్‌లోనే దివ్య నిష్క్రమణ

- కార్తీక్ వెంకటరామన్ ముందంజ
- 'టైబ్రేక్' పోరుకు లలిత్ బాబు, రాజా రిత్విక్



**పనాజీ:** 'వైల్డ్ కార్డు'తో బరిలోకి దిగిన భారత గ్రాండ్‌మాస్టర్, మహిళల ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్... స్వదేశంలో జరుగుతున్న పురుషుల ప్రపంచకప్ టోర్నీలో తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. ఈ టోర్నీలో పోటీపడుతున్న 206 మంది క్రీడాకారుల్లో ఏకైక మహిళా క్రీడాకారిణి అయిన దివ్య ఆడిన రెండు గేముల్లోనూ ఓడిపోయింది. గ్రీస్ గ్రాండ్‌మాస్టర్ అర్డిటిస్ స్టామటిస్ 2-0తో దివ్య దేశ్‌ముఖ్‌ను ఓడించి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. శనివారం జరిగిన తొలి రౌండ్ తొలి గేమ్‌లో 41 ఎత్తుల్లో ఓడిపోయిన దివ్య... టోర్నీలో నిలవాలంటే ఆదివారం జరిగిన రెండో గేమ్‌లో కచ్చితంగా గెలవాల్సింది. అయితే రెండో గేమ్‌లో దివ్య 71 ఎత్తుల్లో పరాజయం పాలైంది. మరోవైపు భారత పురుష గ్రాండ్‌మాస్టర్లు కార్తీక్ వెంకటరామన్ (ఆంధ్రప్రదేశ్), ప్రణవ్ (తమిళనాడు), రౌనక్ సాధ్వాని (మహారాష్ట్ర), ప్రాణేశ్ (తమిళనాడు), ఇనియన్ (తమిళనాడు), సూర్యశేఖర గంగూలీ (బెంగాల్) తొలి రౌండ్‌లో విజయం సాధించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. ప్రణవ్ 2-0తో బుల్‌రెన్స్ (అల్జీరియా)పై, రౌనక్ 1.5-0.5తో డానియల్ బారిష్ (దక్షిణాఫ్రికా)పై, ప్రాణేశ్ 2-0తో సత్బేక్ (కజకిస్తాన్)పై, ఇనియన్ 1.5-0.5తో బెర్డాయెస్ (క్యూబా)పై, కార్తీక్ వెంకటరామన్ 1.5-0.5తో రొబెర్టో గార్సియా (కొలంబియా)పై, సూర్యశేఖర గంగూలీ 2-0తో అహ్మదాజాదా అహ్మద్ (అజర్‌బైజాన్)పై గెలుపొందారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ఎంఆర్ లలిత్‌బాబు, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్, ఎస్ఎల్ నారాయణన్, దీప్తాయన్ ఘోష్ భవితవ్యం నేడు తేలనుంది. ఈ నలుగురు ఈరోజు జరిగే టైబ్రేక్ గేముల్లో తలపడతారు. మాక్స్ వెర్మెర్‌డామ్ (నెదర్లాండ్స్)-లలిత్ బాబుబీ నొగెర్‌బెక్ కాజీబెక్ (కజకిస్తాన్)-రాజా రిత్విక్ మధ్య జరిగిన నిర్ణీత రెండు గేమ్‌లు 'డ్రా'గా ముగియడంతో 1-1తో సమంగా ఉన్నారు. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్లు లియోన్ మెండోంకా, నీలేశ్ సాహా తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. లియోన్ 0.5-1.5తో వాంగ్ షిజు (చైనా) చేతిలో, నీలేశ్ 0.5-1.5తో మియెర్ జార్జి (ఉక్రెయిన్) చేతిలో ఓడిపోయారు.

## అల్లం ముక్కను
## బెల్లంతో కలిపి తినండి

### ఎన్నో అద్భుతమైన లాభాలు కలుగుతాయి..!



అల్లాన్ని మనం రోజూ వంటల్లో వేస్తూనే ఉంటాం. దీన్ని ఎక్కువగా మసాలా వంటకాల్లో వేస్తుంటారు. దీని వల్ల వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. అలాగే బెల్లాన్ని కూడా మనం తరచూ ఉపయోగిస్తూనే ఉంటాం. దీన్ని ఎక్కువగా తీపి వంటకాల తయారీలో ఉపయోగిస్తారు. అయితే ఆయుర్వేద ప్రకారం అల్లం, బెల్లం మిశ్రమం మనకు ఎన్నో లాభాలను అందిస్తుంది. ఇది అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. రోజూ చిన్న అల్లం ముక్కను కాస్త బెల్లంతో కలిపి తింటుండడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఈ మిశ్రమం పలు వ్యాధులను నయం చేస్తుంది. అనేక పోషకాలను అందిస్తుంది. అలాగే ఇన్‌ఫెక్షన్లు సైతం తగ్గేలా చేస్తుంది.

#### శ్వాసకోశ సమస్యలకు..

అల్లం, బెల్లం మిశ్రమాన్ని రోజూ తినడం వల్ల గొంతు, ఊపిరితిత్తులు, శ్వాసనాళాల్లో ఉండే కఫం కరిగిపోతుంది. శ్వాస సరిగ్గా లభిస్తుంది. దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే గొంతు సమస్యలు సైతం తగ్గిపోతాయి. గొంతులో నొప్పి, మంట నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ రెండింటి మిశ్రమం శరీరానికి వెచ్చదనాన్ని అందిస్తుంది. చల్లని వాతావరణం లేదా చలి కాలంలో ఈ మిశ్రమాన్ని తినడం వల్ల శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవచ్చు. చలి నుంచి రక్షణ లభిస్తుంది. ఈ మిశ్రమంలో అనేక రకాల మినరల్స్ ఉంటాయి. దీన్ని తింటే శరీరానికి జింక్, సెలీనియం, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా లభిస్తాయి. ఇవి శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. దీని వల్ల వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు త్వరగా తగ్గుతాయి.

#### జీర్ణ వ్యవస్థకు..

ఈ మిశ్రమం జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి తగ్గుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణవ్యవస్థలోని వ్యర్థాలను సులభంగా బయటకు పంపుతుంది. దీంతో జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఈ మిశ్రమాన్ని తింటే ఐరన్ అధికంగా లభిస్తుంది. ఇది రక్తం వృద్ధి చెందేలా చేస్తుంది. దీంతో రక్తహీనత తగ్గుతుంది. ఈ రెండింటి మిశ్రమాన్ని తింటుంటే శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. నీరసం, అలసట తగ్గుతాయి. యాక్టివ్‌గా మారుతారు. ఉత్సాహంగా పనిచేస్తారు. బద్ధకం పోతుంది.

#### స్త్రీల సమస్యలకు..

స్త్రీలు నెలసరి సమయంలో ఈ మిశ్రమాన్ని తింటుంటే ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. దీని వల్ల కడుపు నొప్పి, అధిక రక్తస్రావం వంటి సమస్యలు తగ్గుతాయి. నెలసరి సరిగ్గా వచ్చేందుకు ఈ మిశ్రమం దోహదం చేస్తుంది. హార్మోన్ల సమస్యలను తగ్గిస్తుంది. ఇలా అల్లం, బెల్లం మిశ్రమం మనకు ఎన్నో లాభాలను అందిస్తుంది. అయితే ఈ మిశ్రమం కొందరిలో అతి వేడిని కలిగించే అవకాశం ఉంటుంది. కనుక అలాంటి వారు ఈ మిశ్రమాన్ని తినరాదు. అలాగే అలర్జీలు ఉన్నవారు కూడా దీనికి దూరంగా ఉండాలి. ఈ విధంగా జాగ్రత్తలను పాటిస్తూ ఈ మిశ్రమాన్ని రోజూ తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

## టీ20లకు విలియమ్సన్ వీడ్కోలు



**ఆక్లాండ్:** న్యూజిలాండ్ దిగ్గజ ఆటగాడు కేన్ విలియమ్సన్ టీ20లకు వీడ్కోలు పలికాడు. కివీస్ తరఫున 93 టీ20లు ఆడిన కేన్.. 2575 పరుగులు సాధించాడు. 2011లో జింబాబ్వేపై పొట్టి క్రికెట్లో అరంగేట్రం చేసిన ఈ స్టార్ బ్యాటర్.. గతేడాది టీ20 ప్రపంచకప్‌లో పపువా న్యూగినియాపై ఆఖరి మ్యాచ్ ఆడాడు. టెస్టులు, వన్డేల్లో కొనసాగనున్న 35 ఏళ్ల కేన్.. వచ్చే ఏడాది ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు వ్యూహ సలహాదారుగా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు.



## మధుమేహం ఉన్నా
## పండ్లు తినొచ్చు

మధుమేహం ఉన్నంత మాత్రాన పండ్లు పూర్తిగా మానేయాల్సిన అవసరమేమీ లేదు. అన్ని పండ్లూ చెడ్డవేమీ కాదు. అరటిపండులోనే కాస్త ఎక్కువగా పిండి పదార్థం ఉంటుంది. మిగతావాటిల్లో అంత ఎక్కువేమీ ఉండదు. పండ్లు తిన్న వెంటనే రక్తంలో గ్లూకోజు మోతాదు పెరుగుతుండొచ్చు గానీ అది రోజంతా అలాగే ఏమీ ఉండదు. నిజానికి ఒక మాదిరిగా మొత్తం పండ్లను తింటే గ్లూకోజు నియంత్రణలో ఉండటానికీ తోడ్పడుతుంది. పండ్లు తింటే (పండ్ల రసాలు కాదు) కడుపు నిండిన భావన కలుగుతుంది. పండ్లలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, వాపు నివారకాలు దండిగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ రాకుండానూ కాపాడతాయి. వీటిల్లోని పీచు మూలంగా జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. మల విసర్జన సాఫీగా అవుతుంది. అందువల్ల రోజుకు ఒకట్రెండు పండ్లు తినటం సురక్షితమే. ఆరోగ్యమూ మెరుగవుతుంది.


రాజముద్ర
www.rajamudranews.com
తెలుగు దిన పత్రిక

## పెళ్లి తర్వాత లైఫ్‌లో థ్రిల్ కావాలా?

### అయితే 'ప్రేమంటే' టీజర్ చూసేయండి

టాలీవుడ్ హీరో ప్రియదర్శి పులికొండ నటిస్తోన్న తాజా చిత్రం 'ప్రేమంటే'. ఈ మూవీతో నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. థ్రిల్ ప్రాప్తిరస్తు అనేది సబ్ టైటిల్. ఈ సినిమాలో ఆనంది హీరోయిన్‌గా కనిపించనుంది. లవ్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ చిత్రాన్ని జాన్వి నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మించారు. ఈ మూవీ ప్రమోషన్లలో భాగంగా తాజాగా టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తే పెళ్లి అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించినట్లు తెలుస్తోంది. పెళ్లి తర్వాత నా లైఫ్ థ్రిల్లింగ్‌గా ఉండాలి అంతే అని హీరోయిన్ చెప్పే డైలాగ్‌తో కథేంటో అర్థమవుతోంది. ఫుల్ లవ్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమా నవంబర్ 21న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ మూవీకి లియోన్ జేమ్స్ సంగీతం సమకూర్చారు.





## మెగా 158లో నటించడం లేదు

మెగాస్టార్ చిరంజీవి ప్రజెంట్ వరుస ప్రాజెక్టులతో సందడి చేస్తున్నాడు. వచ్చే ఏడాది సంక్రాంతి స్పెషల్‌గా 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో వచ్చేందుకు సిద్ధంగా ఉన్న ఈయన.. అప్పుడే తన 'మెగా 158'పై కూడా ఫోకస్ పెట్టిన విషయం తెలిసిందే. బాబీ కొల్లి దర్శకత్వం వహించబోతున్న ఈ మూవీపై ఇప్పటికే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చింది. ఇక ఈ చిత్రం ప్రకటించినప్పటి నుంచి మెగా 158 కు సంబంధించి ఏదో ఒక న్యూస్ నెట్టింట వైరల్ అవుతూనే ఉంది. ఇందులో భాగంగానే ఈ సినిమాలో యంగ్ బ్యూటీ మాళవిక మోహనన్ కూడా భాగం కాబోతుందని.. ఈ కాంబో ఆల్మోస్ట్ కన్ఫర్మ్ అయిందని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే.. తాజాగా ఈ వార్తలపై స్పందిస్తూ క్లారిటీ ఇచ్చింది మాళవిక. ఈ మేరకు తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'హాయ్ గాయ్స్.. బాబీ సర్ దర్శకత్వం వహిస్తున్న మెగా 158 లో నేను భాగం కాబోతున్నానని ఆన్‌లైన్‌లో చాలా వార్తలు వస్తున్నాయి. నా కెరీర్‌లో ఏదో ఒకరోజు మెగాస్టార్ చిరంజీవి సర్‌తో స్క్రీన్‌ను షేర్ చేసుకునే అవకాశం రావాలని నేను కోరుకుంటున్నాను. కానీ ఇప్పుడు అయితే నేను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కాదని, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా అబద్ధమని స్పష్టం చేయాలనుకుంటున్నాను' అంటూ ఫైనల్‌గా క్లారిటీ ఇచ్చింది మాళవిక. కాగా.. కన్నడ అగ్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించబోతున్న'మెగా 158'షూటింగ్ నవంబర్ నెలకరు నుంచి స్టార్ట్ కానున్నట్లు తెలుస్తుంది.

## పుష్ప సినిమా నా కెరీర్‌పై ప్రభావం చూపింది

క్రేజీ బ్యూటీ శ్రీలీల 'మాస్ జాతర'తో సినీ ప్రియులును అలరిస్తోంది. అప్పుడే మరో సినిమాను లైన్‌లో పెట్టేసింది. ప్రస్తుతం ఈ భామ 'ఉస్తాద్ భగత్ సింగ్' పనుల్లో ఫుల్ బిజీ అయిపోయింది. వరుస చిత్రాల్లో నటిస్తున్న శ్రీలీల 'పుష్ప-2' లో ఐటమ్ సాంగ్ కూడా చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె షాకింగ్ కామెంట్స్ చేసింది. "పుష్ప సినిమా నా కెరీర్‌పై ప్రభావం చూపింది. అలాంటి పెద్ద ప్రాజెక్టులో భాగం కావడం నాకు గర్వకారణం. కానీ ఇలాంటి ఐటమ్ సాంగ్స్ వేరే సినిమాల్లో మాత్రం చేయను. ఇకపై ఐటమ్ సాంగ్ చేసి తప్పు చేయాలనుకోవడం లేదు. ప్రపంచవ్యాప్తంగా రికార్డులు సృష్టించిన చిత్రంలో నేను భాగం అవ్వడం నాకు గర్వంగా అనిపించింది. ఇండస్ట్రీలో నన్ను చాలామంది బెస్ట్ డ్యాన్సర్‌గా మాత్రమే చూస్తున్నారు. కానీ నేను కేవలం డ్యాన్సర్ కాదు, మంచి నటిని కూడా అని గుర్తించడం లేదు. నా పర్ఫామెన్స్ అందరికీ తెలిసినప్పటికీ డ్యాన్సర్‌గానే చూస్తున్నారు. అలాంటి ఆలోచనలు మార్చడం అంత తేలిక కాదు.. ఎవరి అభిప్రాయం వారిది. నా పని మాత్రం ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడం. అందుకే ప్రతి సినిమాలో కొత్తగా ఏదైనా చూపించాలని ప్రయత్నిస్తున్నాను" అని చెప్పుకొచ్చింది. దీంతో ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు షాక్ అవుతున్నారు. ఐటమ్ సాంగ్స్ చేయడం అంత పెద్ద తప్పేమి కాదు.. ఫేమ్ పెరుగుతుందని సలహాలు ఇస్తున్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com